'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

రాజ్య సంస్కరణ


TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 85 | బుధవారం | 11.11.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 85 | Wednesday | 11.11.2026 | Pages: 8 | Rate: 2



వీడిన మౌనం

ఇన్నాళ్లూ సైలెంట్..ఇప్పుడు సెన్సేషన్

» రాజకీయాల్లో సోనియా సంచలనం
» ఆత్మకథతో ప్రత్యర్థుల్లో అంతర్మథనం
» ప్రేమ ప్రయాణం.. కుటుంబ కలహం..
» గుజరాత్ గాయం.. రాజకీయ రణం!

ఒకప్పుడు రాజకీయాలకు దూరంగా ఉండాలనుకున్న మహిళ.. చివరకు దేశ రాజకీయాలను ప్రభావితం చేసిన నాయకురాలిగా ఎలా ఎదిగారు? ఆ ప్రయాణంలో దాగిన విషాదాలు, కుటుంబ కలహాలు, అధికార పోరాటాలు, రాజకీయ నిర్ణయాల వెనుక అసలు కథేమిటి? సోనియా గాంధీ రాసిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' ఇప్పుడు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. 2002 గుజరాత్ అల్లర్ల సమయంలో బాధిత శిబిరంలో ఓ తండ్రి తన కుమార్తెను చూపిస్తూ చేసిన హృదయవిదారక విజ్ఞప్తి తనను ఎలా కలచివేసిందో సోనియా వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీతో తనకున్న పరిమిత పరిచయం, ఇద్దరి మధ్య సిద్ధాంతపరమైన విభేదాలపై మనసు విప్పారు. సంజయ్ గాంధీ మరణం తర్వాత మేనకా గాంధీతో కుటుంబ సంబంధాలు ఎలా దెబ్బతిన్నాయో వివరించారు. ఎమర్జెన్సీ, 2004లో ప్రధాని పదవిని తిరస్కరించడం, కాంగ్రెస్ భవిష్యత్తుపైనా కీలక వ్యాఖ్యలు చేశారు. అటు బీజేపీ ఎదురుదాడి.. ఇటు కాంగ్రెస్ సమర్థన! ప్రచురణ సంస్థ మార్పుపైనా వివాదం! ఇది కేవలం ఆత్మకథ కాదు.. ఒక కుటుంబ చరిత్ర, ఒక నాయకురాలి అంతరంగం, దేశ రాజకీయాలపై మరో కోణం! అసలు సోనియా ఏం చెప్పారు?

వివరాలు3,4,7లో..



ప్రధాని పదవిపై ప్రణబ్ ఆశ

ఆశయం బయటపెట్టిన దాదా ఆశ్చర్యపోయానన్న సోనియా!

మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి ప్రధానమంత్రి కావాలనే బలమైన ఆకాంక్ష ఉండేదా? 2010లో తనతో జరిగిన ఓ సంభాషణలో ఆయన ప్రధాని పదవిపై ఆసక్తిని పరోక్షంగా వ్యక్తం చేయడం తనను ఆశ్చర్యానికి గురిచేసిందని కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ వెల్లడించారు.

ఆశపడటం తప్పా?

సోనియాపై ప్రణబ్ కుమార్తె ఎదురుదాడి!

మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి ప్రధానమంత్రి కావాలనే ఆశయం ఉండటంలో ఆశ్చర్యపడాల్సిన అవసరం ఏముందని ఆయన కుమార్తె శర్మిష్ఠ ముఖర్జీ ప్రశ్నించారు.





ప్రధాని పీఠం త్యాగం

మన్మోహన్‌కు పట్టం కట్టిన సోనియా!

2004లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ విజయం సాధించిన తర్వాత ప్రధానమంత్రి పదవిని స్వీకరించేందుకు సోనియాగాంధీ నిరాకరించడం దేశ రాజకీయాల్లో కీలక మలుపుగా నిలిచింది.

కోపంతో వణికించిన ఇందిర

అత్త మనస్తత్వంపై సోనియా

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ కోపం ఎలా ఉండేదో, ఆమె కోడలు సోనియాగాంధీ తన తాజా పుస్తకం ఆసక్తికరంగా వెల్లడించారు. పెళ్లయిన తొలినాళ్లలో అత్తగారి ఆగ్రహాన్ని చూసి తాను కుర్చీలోనే వణికిపోయేదాన్నని గుర్తుచేసుకున్నారు. ఇందిర కోపం సిబ్బందిని నిశ్చేష్టులను చేసేదని రాశారు.





రెండుసార్లు క్యాన్సర్ ముప్పు

ధైర్యంగా గెలిచిన సోనియా!

యూపీఏ రెండోసారి అధికారంలోకి వచ్చిన సమయంలో రాజకీయ బాధ్యతలతో పాటు వ్యక్తిగతంగా ఆరోగ్య సమస్యలు కూడా తనను తీవ్రంగా ఇబ్బంది పెట్టాయని కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ వెల్లడించారు.

మోదీతో మాటలే లేవు

నమస్కారానికే పరిమితమైన పలకరింపు

ప్రధాని నరేంద్ర మోదీతో తనకు ఇప్పటివరకు పెద్దగా వ్యక్తిగత పరిచయం లేదని కాంగ్రెస్ ఎంపీ సోనియాగాంధీ వెల్లడించారు.





గుజరాత్ అల్లర్ల భయానక జ్ఞాపకాలు

చిన్నారి దుస్థితి చూసి చలించిన సోనియా!

2002 గుజరాత్ అల్లర్లు తన జీవితంలో ఎప్పటికీ మరిచిపోలేని విషాద ఘటనగా మిగిలిపోయాయని కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ వెల్లడించారు.


ఎన్నికల కోసం కాదు

పదేళ్ల క్రితమే మొదలైన రచన

2029 ఎన్నికలతో సంబంధం లేదన్న ఎన్.రామ్!

సోనియా గాంధీ రాసిన 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం 2029 లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తీసుకొచ్చింది కాదని ప్రముఖ పాత్రికేయుడు, 'ది హిందూ' మాజీ సంపాదకుడు ఎన్.రామ్ స్పష్టం చేశారు.





మేనకా-సోనియా మధ్య చిచ్చు

గాంధీ కుటుంబంలో కలహాల కథ!

గాంధీ కుటుంబంలో ఒకప్పుడు ఆత్మీయంగా మొదలైన బంధం.. చివరకు తీవ్ర విభేదాలకు దారితీసింది. సంజయ్ గాంధీ భార్య మేనకా గాంధీతో తనకున్న అనుబంధం ఎలా దెబ్బతిన్నదో సోనియా గాంధీ తన తాజా జ్ఞాపకాల పుస్తకం వివరించారు. 1973 చివర్లో సంజయ్‌కు మేనక పరిచయమయ్యారని, అప్పటికి ఆమె వయసు 18 ఏళ్లు కూడా లేదని సోనియా గుర్తుచేసుకున్నారు. ఏడాదిలోపే వీరిద్దరి వివాహం జరగడంతో మేనక గాంధీ కుటుంబంలోకి అడుగుపెట్టారు.



సోనియా పుస్తకంపై బీజేపీ ఫైర్

'వైట్‌వాషింగ్' అంటూ విమర్శలు!

1975లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీని సోనియా తన పుస్తకంలో తప్పిదంగా పేర్కొన్నప్పటికీ, దాన్ని సమర్థించే ప్రయత్నం చేశారని బీజేపీ తీవ్రంగా విమర్శించింది.

1984 సిక్కుల ఊచకోత

సోనియా పుస్తకంపై బీజేపీ ఎదురుదాడి!

1984లో దేశాన్ని కుదిపేసిన సిక్కుల మారణకాండ ఇప్పుడు మరోసారి రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ఘటనకు సంబంధించి రాజీవ్ గాంధీతో పాటు కాంగ్రెస్ నాయకత్వాన్ని బాధ్యత నుంచి తప్పించే ప్రయత్నం చేశారని బీజేపీ ఆరోపించింది.



కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా సాధించాలి

◆సుప్రీంకోర్టులో కేసు గట్టిగా వాదించండి
◆అధికారులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం!



కృష్ణా జలాల పంపిణీలో తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటాను సాధించేందుకు న్యాయపోరాటాన్ని మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్‌తో వివాదం ఉన్న ప్రతి అంశంపై పూర్తి ఆధారాలతో సుప్రీంకోర్టులో సమర్థంగా వాదనలు వినిపించాలని స్పష్టం చేశారు. ఈ నెల 18 తర్వాత కేసు విచారణకు రానున్న నేపథ్యంలో న్యాయ నిపుణులతో ప్రత్యేకంగా చర్చించారు. ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో నిర్వహించిన నీటిపారుదల శాఖ సమీక్షలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నీటిపారుదల సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సి.ఎస్. వైద్యనాథన్‌తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణ ప్రయోజనాలకు భంగం కలగకుండా అన్ని అంశాలను న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లాలని సీఎం సూచించారు. (వివరాలు 2లో..)



హోదా వచ్చిన గతాన్ని మరువొద్దు

- 30 ఏళ్ల భవిష్యత్తు మీ చేతుల్లోనే!
- డీఎస్పీలకు సీఎం దిశానిర్దేశం

తెలంగాణలో డీఎస్పీల నియామకాలు సంక్లిష్ట పరిస్థితుల్లో పూర్తి చేశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో నూతనంగా ఎంపికైన డీఎస్పీలను ఉద్దేశించి మాట్లాడుతూ, నోటిఫికేషన్ నుంచి నియామకాల వరకు తమ ప్రభుత్వమే ప్రక్రియను పూర్తి చేసిందన్నారు. 2011 తర్వాత దాదాపు 13 ఏళ్లపాటు గ్రూప్ 1 నియామకాలు జరగలేదని, గతంలో టీజీపీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీలు, ఇతర గందరగోళంతో నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయారని గుర్తుచేశారు. (వివరాలు 2లో..)



భూమి నీ అబ్బజాగీరు కాదు.. కూకట్‌పల్లిలో అమ్మొద్దు!

ప్రభుత్వ భూముల వేలంపై ఈటల రాజేందర్ ఆగ్రహం

కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాలను వేలం వేయడంపై మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేపీహెచ్‌బీ కాలనీలోని ఫోరం మాల్ ఎదురుగా నిర్వహించిన ధర్నాలో పాల్గొని ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. "భూమి నీ అబ్బజాగీరు కాదు.. కూకట్‌పల్లిలో భూములు అమ్మకు" అంటూ సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రజల ఆస్తులను కాపాడాల్సిన ముఖ్యమంత్రే భూములు అమ్ముతున్నారని, ప్రభుత్వం రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా వ్యవహరిస్తోందని విమర్శించారు. చిన్నచిన్న ప్లాట్లను కూడా వేలం వేయడం ఏమిటని ప్రశ్నించారు. భూములను కాపాడలేక అమ్ముతున్నామని చెప్పడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. "నీవు ప్రగతిశీల ముఖ్యమంత్రివా? ప్రజలను ఇబ్బంది పెట్టడానికే ఉన్నావా?" అంటూ నిలదీశారు. (2లో..)

డాక్టర్లు ఎక్కడ? మందులేవీ?

పేదలకు వైద్యం అందించరా?

- డ్యూటీలోని వైద్యులూ గైర్హాజరా?
- కాంగ్రెస్ పాలనపై హరీశ్‌రావు ఫైర్!
- సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ




సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు ఆకస్మిక తనిఖీ నిర్వహించి వైద్యుల గైర్హాజరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్ఎంఓ గదిలో అటెండెన్స్ రిజిస్టర్లు పరిశీలించగా, చాలామంది వైద్యులు సంతకాలు చేసి విధులకు హాజరుకాకపోవడం కనిపించిందని తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకే ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, రేడియాలజీ, కంటి విభాగాల్లో సీనియర్ వైద్యులు అందుబాటులో లేరని ఆరోపించారు. 230 మంది రెగ్యులర్ డాక్టర్లు, 88 మంది పీజీ వైద్యులు కలిపి 318 మంది సిబ్బంది ఉన్న ఆసుపత్రిలో 600 పడకలకు కేవలం 301 మంది ఇన్‌పేషెంట్లే ఉండటంపై ప్రశ్నించారు. "డాక్టర్ల బాధ్యతారాహిత్యం, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య తగ్గుతోంది" అని విమర్శించారు. (2లో..)

అండాల అక్రమ దందా

ఐవీఎఫ్ కేంద్రాలపై తనిఖీలు

- 31 మంది మహిళల గుర్తింపు
- ఏడు ఆసుపత్రుల్లో ఉల్లంఘనలు



మహిళల నుంచి అండాల సేకరణ పేరుతో జరుగుతున్న అక్రమ దందాపై తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమైంది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఐవీఎఫ్ కేంద్రాలు, ఆసుపత్రులు, మధ్యవర్తులపై సమగ్ర విచారణ చేపట్టాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఆయన ఆదేశాలతో రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేశారు. రాష్ట్రంలో గుర్తించిన 44 ఏఆర్టీ కేంద్రాలకు గాను ఇప్పటివరకు 27 కేంద్రాల్లో తనిఖీలు పూర్తయ్యాయి. (వివరాలు 2లో..)

శ్రీశైలం, సాగర్ అసలు అనుమతులపై కేఆర్ఎంబీ ఆరా!

ప్రాజెక్టుల లెక్కలు ఇవ్వాలని రాష్ట్రాలకు బోర్డు లేఖలు

శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు సంబంధించి మొదట మంజూరైన అనుమతుల పూర్తి వివరాలు సమర్పించాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలను ఆదేశించింది. ఈ మేరకు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖలకు తాజాగా లేఖలు రాసింది. కేంద్ర జలశక్తి శాఖ సూచనల ప్రకారం మొదట ఆమోదించిన ప్రాజెక్టుల రూపకల్పనే ప్రాథమిక ప్రాతిపదికగా తీసుకుని, ఆ తర్వాత జరిగిన మార్పులను పరిశీలించనున్నట్లు స్పష్టం చేసింది. (వివరాలు 2లో..)



భూమి నీ అబ్బజాగీరు కాదు..

కూకట్‌పల్లిలో అమ్మొద్దు!

ప్రభుత్వ భూముల వేలంపై ఈటల రాజేందర్ ఆగ్రహం

కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాలను వేలం వేయడంపై మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేపీహెచ్‌బీ కాలనీలోని ఫోరం మాల్ ఎదురుగా నిర్వహించిన ధర్నాలో పాల్గొని ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. "భూమి నీ అబ్బజాగీరు కాదు.. కూకట్‌పల్లిలో భూములు అమ్మకు" అంటూ సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రజల ఆస్తులను కాపాడాల్సిన ముఖ్యమంత్రే భూములు అమ్ముతున్నారని, ప్రభుత్వం రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా వ్యవహరిస్తోందని విమర్శించారు. చిన్నచిన్న ప్లాట్లను కూడా వేలం వేయడం ఏమిటని ప్రశ్నించారు. భూములను కాపాడలేక అమ్ముతున్నామని చెప్పడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. "నీవు ప్రగతిశీల ముఖ్యమంత్రివా? ప్రజలను ఇబ్బంది పెట్టడానికే ఉన్నావా?" అంటూ నిలదీశారు.

పెరుగుతున్న జనాభా.. తగ్గుతున్న ప్రజా స్థలాలు!

కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ ఆసియాలోనే అతిపెద్ద కాలనీల్లో ఒకటని, పేదలకు ఇళ్లు నిర్మించేందుకు రైతుల నుంచి భూములు సేకరించారని ఈటల గుర్తుచేశారు. ఇక్కడ ఇప్పటికే జనసాంద్రత అధికంగా ఉందని, తాగునీరు, రహదారులు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల కొరత ఉందని పేర్కొన్నారు. హైదరాబాద్ జనాభా 30 లక్షల నుంచి కోటి 70 లక్షలకు పెరిగిందని చెబుతూ, ఇలాంటి పరిస్థితుల్లో పిల్లలకు ఆటస్థలాలు, ప్రజలకు పార్కులు, గుడులు, బడుల కోసం కేటాయించిన స్థలాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. వాటిని విక్రయిస్తే భవిష్యత్తులో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని హెచ్చరించారు. పిల్లలు సెల్‌ఫోన్లు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలంటే ఆటస్థలాలు అవసరమని చెప్పారు.

రేవంత్‌కు ఈటల హెచ్చరిక.. ప్రజల ఆవేదన గుర్తించాలి!

ఒకవైపు ప్రభుత్వ భూములను కాపాడేందుకు సుప్రీంకోర్టులో పోరాడుతున్నామని చెబుతూ, మరోవైపు కూకట్‌పల్లిలో ప్లాట్లు అమ్మడం ఏమిటని ఈటల ప్రశ్నించారు. భూముల కబ్జాల వెనుక నాయకులు, అధికారులు, కబ్జాదారుల కుమ్మక్కు ఉందన్న ఆరోపణలు చేశారు. గండిపేట, హైటెక్‌సిటీ, నానక్‌రామ్‌గూడలో భూముల విక్రయాలను తాము అడ్డుకోవడం లేదని, అత్యధిక జనసాంద్రత ఉన్న కూకట్‌పల్లిలో ప్రజా అవసరాల స్థలాలను మాత్రమే కాపాడాలని కోరుతున్నామని స్పష్టం చేశారు. ఈ ధర్నాను బీజేపీ రాజకీయ కార్యక్రమంగా చూడకుండా ప్రజల ఆవేదనగా గుర్తించాలని రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలు కొనసాగితే ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్‌రెడ్డితో పాటు పలువురు పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా సాధించాలి

- సుప్రీంకోర్టులో కేసు గట్టిగా వాదించండి
- అధికారులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం!

తెలంగాణ ప్రయోజనాలకు భంగం కలగకుండా అన్ని అంశాలను న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లాలని సీఎం సూచించారు.

డిండి, అచ్చంపేట పనులకు వేగం..

డిండి, అచ్చంపేట ఎత్తిపోతల పథకాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఇంజనీర్లను ముఖ్యమంత్రి ఆదేశించారు. ముందుగా నిర్ణయించిన ప్రణాళిక ప్రకారం ఏదుల నుంచి ఈ రెండు పథకాలకు నీటిని అందించాలని స్పష్టం చేశారు. ఇందుకోసం అవసరమైన 0.6 టీఎంసీల నీటిని నార్లపూర్ నుంచి ఏదుల వరకు తరలించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. నీటి తరలింపునకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని, ఎక్కడ సొరంగాలు నిర్మించాలి, ఎక్కడ కాలువలు తవ్వాలనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. అవసరమైన సాంకేతిక వివరాలతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేసి, దానికి అనుగుణంగా పనులు ప్రారంభించాలని స్పష్టం చేశారు.

కాళేశ్వరం పనుల్లో తొందరపాటు వద్దు..

కాళేశ్వరం అదనపు టీఎంసీ పనుల విషయంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని రేవంత్‌రెడ్డి అధికారులను హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న రెండు టీఎంసీల నీటినే పూర్తిస్థాయిలో తరలించలేని పరిస్థితులున్నాయని, అలాంటప్పుడు అదనపు



టీఎంసీ పనులపై బాధ్యతాయుతంగా నిర్ణయాలు తీసుకోవాలని పేర్కొన్నారు. ముందుగా సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని పరిశీలించి, ఆ తర్వాత భూసేకరణ చేపట్టాలని ఆదేశించారు. కేంద్ర జల సంఘం నుంచి అవసరమైన అనుమతులన్నీ పొందిన తర్వాతే తదుపరి చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర డీపీఆర్ సిద్ధం చేసి, చట్టపరమైన, సాంకేతిక అంశాలను పరిశీలించిన అనంతరం ముందుకు వెళ్లాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

హోదా వచ్చిన గతాన్ని మరువొద్దు

30 ఏళ్ల భవిష్యత్తు మీ చేతుల్లోనే! డీఎస్పీలకు సీఎం దిశానిర్దేశం

తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే టీజీపీఎస్సీ ప్రక్షాళనకు నిర్ణయించానని చెప్పారు. యూపీఎస్సీ విధానాలను అధ్యయనం చేసి, పోటీ పరీక్షల నిర్వహణలో అనుభవం, చిత్తశుద్ధి ఉన్నవారిని సభ్యులుగా నియమించామని తెలిపారు. 563 గ్రూప్ 1 పోస్టులకు 562 మంది చేరగా, 112 మంది డీఎస్పీల నియామకాలు కూడా పూర్తి చేశామని వెల్లడించారు. ఆరోపణలు, న్యాయపరమైన సవాళ్లు ఎదురైనా సుప్రీంకోర్టు వరకు వెళ్లి నిష్ణాతులైన న్యాయవాదులతో వాదించి నియామకాలను సాధించామని పేర్కొన్నారు.

ప్రజలే ప్రాధాన్యం.. హోదా సేవకోసమే!

నూతన డీఎస్పీలు తమ నేపథ్యాన్ని మరిచిపోకుండా ప్రజాసేవకు అంకితం కావాలని సీఎం సూచించారు. వచ్చే 30 ఏళ్ల తెలంగాణ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో మీ పాత్ర కీలకమని స్పష్టం చేశారు. ప్రజలతో నేరుగా సంబంధాలు ఉండే బాధ్యతాయుతమైన హోదాలో ఉన్నారని, మీ నిర్ణయాలు ప్రభుత్వ ప్రతిష్ఠను ప్రభావితం చేస్తాయని చెప్పారు. నిజాయితీ, నిబద్ధతతో



విధులు నిర్వహించాలని, అధికారాన్ని వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించవద్దని హెచ్చరించారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చినప్పుడు వారిని గౌరవంగా కూర్చోబెట్టి, సమస్యను ఓపికగా విని అర్థం చేసుకోవాలని సూచించారు. సమస్య పరిష్కారానికి సమయం, వనరులు, సాంకేతిక సహకారం కీలకమని వివరించారు. ప్రజలకు ఆపద వచ్చినప్పుడు ముందుగా గుర్తుకు వచ్చేది పోలీసు వ్యవస్థేనని, సీనియర్ అధికారులు సంపాదించిన విశ్వాసాన్ని కొత్త అధికారులు కాపాడాలని కోరారు.

మారుతున్న నేరాలు.. ఆధునిక పోలీసింగ్ అవసరం!

ప్రస్తుతం నేరాల స్వరూపం పూర్తిగా మారిపోయిందని రేవంత్‌రెడ్డి అన్నారు. ఒకరినొకరు చూడకుండానే ప్రజల ఆస్తులను దోచుకునే స్థాయికి సైబర్ నేరాలు పెరిగాయని వివరించారు. డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం ఈగల్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఫుడ్ సేఫ్టీ, ట్రాఫిక్ నియంత్రణ, మాదకద్రవ్యాల నిరోధం, సైబర్ నేరాల కట్టడికి ప్రత్యేక వ్యవస్థలను తీసుకొచ్చామని చెప్పారు. అవసరమైతే నూతన డీఎస్పీలను విదేశాలకు పంపించి ఆధునిక పోలీసింగ్ విధానాలపై అధ్యయనం చేయిస్తామని వెల్లడించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులను కూడా విద్యా ప్రమాణాల పరిశీలనకు విదేశాలకు పంపిస్తున్నామని ఉదహరించారు. విధుల్లో మానసిక స్థైర్యంతో పాటు శారీరక దృఢత్వం కూడా ముఖ్యమని, డీఎస్పీలు తమ ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా క్రమశిక్షణతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

శ్రీశైలం, సాగర్ అసలు అనుమతులపై కేఆర్ఎంబీ ఆరా!

ప్రాజెక్టుల లెక్కలు ఇవ్వాలని రాష్ట్రాలకు బోర్డు లేఖలు

శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు సంబంధించి మొదట మంజూరైన అనుమతుల పూర్తి వివరాలు సమర్పించాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలను ఆదేశించింది. ఈ మేరకు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖలకు తాజాగా లేఖలు రాసింది. కేంద్ర జలశక్తి శాఖ సూచనల ప్రకారం మొదట ఆమోదించిన ప్రాజెక్టుల రూపకల్పనే ప్రాథమిక ప్రాతిపదికగా తీసుకుని, ఆ తర్వాత జరిగిన మార్పులను పరిశీలించనున్నట్లు స్పష్టం చేసింది. ప్రాజెక్టుల అసలు నిర్మాణం, నీటి వినియోగం, ఎడమ, కుడి కాల్వల సామర్థ్యం, ఆయకట్టు పరిధి, నీటి అవసరాల వివరాలతో పాటు అదనంగా చేపట్టిన పనుల సమాచారాన్ని అందించాలని కోరింది. 2016 కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్ కేటాయింపులు కూడా పరిశీలనకు ప్రాతిపదికగా ఉంటాయని తెలిపింది.

అనుమతి లేని పనులపై వివరాలివ్వండి

2021లో కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్‌లో శ్రీశైలం ప్రాజెక్టులో 11, నాగార్జునసాగర్‌లో రెండు అనుమతి లేని భాగాలు ఉన్నట్లు పేర్కొన్న విషయాన్ని కేఆర్ఎంబీ గుర్తుచేసింది. ఆయా పనులకు సంబంధించిన సాంకేతిక అనుమతులు, కేంద్ర సంస్థల క్లియరెన్స్ పత్రాలను సమర్పించాలని నవంబర్ 6న రాసిన లేఖలో కోరింది. అదనపు పథకాలు, నీటి అవసరాల పెంపు, ప్రాజెక్టుల పరిధిలో చేసిన మార్పుల వివరాలను కూడా అందించాలని స్పష్టం చేసింది. గతంలో సెప్టెంబర్ 21, అక్టోబర్ 1, 16, 30 తేదీల్లో రాసిన లేఖలకు ఇంకా పూర్తి సమాచారం అందలేదని అసంతృప్తి వ్యక్తం చేసింది. రెండు రాష్ట్రాల హక్కులు, వాదనలకు భంగం కలగకుండా అసలు అనుమతుల వివరాలను సేకరిస్తున్నామని బోర్డు పేర్కొంది.





డాక్టర్లు ఎక్కడ? మందులేవీ?

పేదలకు వైద్యం అందించరా?

- డ్యూటీలోని వైద్యులూ గైర్హాజరా?
- కాంగ్రెస్ పాలనపై హరీశ్‌రావు ఫైర్!
- సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు ఆకస్మిక తనిఖీ నిర్వహించి వైద్యుల గైర్హాజరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్ఎంఓ గదిలో అటెండెన్స్ రిజిస్టర్లు పరిశీలించగా, చాలామంది వైద్యులు సంతకాలు చేసి విధులకు హాజరుకాకపోవడం కనిపించిందని తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకే ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, రేడియాలజీ, కంటి విభాగాల్లో సీనియర్ వైద్యులు అందుబాటులో లేరని ఆరోపించారు. 230 మంది రెగ్యులర్ డాక్టర్లు, 88 మంది పీజీ వైద్యులు కలిపి 318 మంది సిబ్బంది ఉన్న ఆసుపత్రిలో 600 పడకలకు కేవలం 301 మంది ఇన్‌పేషెంట్లే ఉండటంపై ప్రశ్నించారు. "డాక్టర్ల బాధ్యతారాహిత్యం, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య తగ్గుతోంది" అని విమర్శించారు. మెటర్నిటీ, ఆర్థోపెడిక్, చిన్నపిల్లల వార్డులు, ఫార్మసీని పరిశీలించి రోగులతో నేరుగా మాట్లాడారు.

మందుల కొరత.. నిలిచిన శస్త్రచికిత్సలు!

ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా అందాల్సిన మందులను పేదలు బయట కొనుక్కోవాల్సి వస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. 500 రకాల మందులు రావాల్సి ఉండగా 200 మాత్రమే అందుబాటులో ఉన్నాయని, 350 నాన్ సర్జికల్ మందుల్లో 160, 150 సర్జికల్ మందుల్లో 70 మాత్రమే ఉన్నాయని వివరించారు. చిన్నపిల్లల వార్డులో 10 వెంటిలేటర్లు ఉన్నా ఒక్కటీ పనిచేయడం లేదని, రోగులకు రూ.1,000 నుంచి రూ.1,500 విలువైన మందులను ప్రైవేట్ మెడికల్ షాపుల్లో కొనుగోలు చేయాలని సూచిస్తున్నారని తెలిపారు. సిద్దిపేట ఆసుపత్రికి మూడేళ్లుగా రూ.30 కోట్ల ఆరోగ్యశ్రీ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, రాష్ట్రవ్యాప్తంగా రూ.1,000 కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయాయని ఆరోపించారు. నిధులు లేక మోకాలి చిప్పల మార్పిడి ఆపరేషన్లకు అవసరమైన ఇంప్లాంట్స్ సరఫరా నిలిచిపోయిందన్నారు. గైనకాలజీ ఆపరేషన్ థియేటర్ పైకప్పు రెండేళ్లుగా కారుతున్నా మరమ్మతులు చేయలేదని, కంటి విభాగంలో అవసరమైన పరికరాలు లేక ఆపరేషన్లు తగ్గాయని పేర్కొన్నారు.


24 గంటల్లోనే ఆపరేషన్.. వైద్యులకు ఆదేశాలు!

కేసీఆర్ హయాంలో పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు సిద్దిపేటలో 600 పడకల మెడికల్ కాలేజీ ఆసుపత్రిని ఏర్పాటు చేశామని హరీశ్‌రావు గుర్తుచేశారు. మరోవైపు 1,000 పడకల ఆసుపత్రి నిర్మాణం 90 శాతం పూర్తయినా, మిగిలిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని విమర్శించారు. గర్భిణులకు కేసీఆర్ కిట్, ఆర్థిక సాయం అందడం లేదని రోగులు తన దృష్టికి తెచ్చారని తెలిపారు. ఆర్థోపెడిక్ విభాగంలో 18 మంది వైద్యులు ఉన్నా గత నెలలో 69 మేజర్, 136 మైనర్ ఆపరేషన్లే జరిగాయని, సీటీ స్కాన్ నివేదికలకు మూడు, నాలుగు రోజులు పడుతోందని వివరించారు. తనిఖీ అనంతరం వైద్యులు, అధికారులతో సమీక్ష నిర్వహించి రోగి వచ్చిన 24 గంటల్లో అవసరమైన శస్త్రచికిత్స పూర్తి చేయాలని, వైద్యులంతా ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధుల్లో ఉండాలని ఆదేశించినట్లు చెప్పారు. పెండింగ్ బిల్లులు విడుదల చేసి మందులు, పరికరాల కొరత తీర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇకపై ప్రతి నెలా ఆసుపత్రి పనితీరును స్వయంగా సమీక్షిస్తానని ప్రకటించారు.

అండాల అక్రమ దందా

ఐవీఎఫ్ కేంద్రాలపై తనిఖీలు

- 31 మంది మహిళల గుర్తింపు
- ఏడు ఆసుపత్రుల్లో ఉల్లంఘనలు






మహిళల నుంచి అండాల సేకరణ పేరుతో జరుగుతున్న అక్రమ దందాపై తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమైంది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఐవీఎఫ్ కేంద్రాలు, ఆసుపత్రులు, మధ్యవర్తులపై సమగ్ర విచారణ చేపట్టాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఆయన ఆదేశాలతో రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేశారు. రాష్ట్రంలో గుర్తించిన 44 ఏఆర్టీ కేంద్రాలకు గాను ఇప్పటివరకు 27 కేంద్రాల్లో తనిఖీలు పూర్తయ్యాయి. వీటిలో ఏడు ఆసుపత్రుల్లో 13 నిబంధనల ఉల్లంఘనలు గుర్తించిన అధికారులు యాజమాన్యాలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మిగిలిన కేంద్రాల్లోనూ తనిఖీలు కొనసాగుతున్నాయి. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు 31 మంది మహిళలను గుర్తించగా, అండాల సేకరణలో వైద్యులు, ఐవీఎఫ్ కేంద్రాలు, మధ్యవర్తుల పాత్రపై అధికారులు లోతుగా విచారణ చేస్తున్నారు.


ఢిల్లీలో వివరాల సేకరణ.. రికార్డుల పరిశీలన!

ఈ అక్రమ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలు సేకరించేందుకు నవంబర్ 6న తెలంగాణ వైద్య అధికారులు న్యూఢిల్లీలోని జాతీయ ఏఆర్టీ అండ్ సరోగసీ రిజిస్ట్రీని సందర్శించారు. రాష్ట్రంలో నమోదైన ఏఆర్టీ కేంద్రాలు, ఏఆర్టీ బ్యాంకుల వివరాలను కోరారు. అవసరమైన సమాచారాన్ని అందిస్తామని జాతీయ సమాచార కేంద్రం (ఎన్ఐసీ) అధికారులు హామీ ఇచ్చారు. మరోవైపు పోలీసుల స్వాధీనంలో ఉన్న రికార్డులతో పాటు జాతీయ రిజిస్ట్రీ నుంచి వచ్చే సమాచారాన్ని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. వైద్యుల నుంచి మధ్యవర్తుల వరకు ఎవరి పాత్ర ఉన్నా వదిలిపెట్టకుండా విచారణ జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆధారాల పరిశీలన అనంతరం బాధ్యులపై తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

మహిళలకు హెచ్చరిక.. అక్రమాలకు పాల్పడితే శిక్షలు!

అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ (రెగ్యులేషన్) చట్టం-2021 ప్రకారం మహిళల నుంచి నిబంధనలకు విరుద్ధంగా అండాలను సేకరించడం శిక్షార్హమైన నేరమని వైద్య ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది. రాష్ట్రంలోని అన్ని ఏఆర్టీ క్లినిక్‌లు, ఏఆర్టీ బ్యాంకులు తప్పనిసరిగా చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్ పొందాలని, నిర్దేశించిన నిబంధనలు పాటించాలని హెచ్చరించింది. మధ్యవర్తుల మాయమాటలు, ఆర్థిక ప్రలోభాలకు ఆకర్షితులై అక్రమ వైద్య విధానాలకు బలికావద్దని మహిళలకు సూచించింది. ఎక్కడైనా ఇలాంటి అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే సంబంధిత జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరింది. మహిళల ఆరోగ్యం, భద్రతకు భంగం కలిగించే అక్రమ పద్ధతులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించనుంది.







ప్రధాని పీఠం త్యాగం

మన్మోహన్‌కు పట్టం కట్టిన సోనియా!

2004లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ విజయం సాధించిన తర్వాత ప్రధానమంత్రి పదవిని స్వీకరించేందుకు సోనియాగాంధీ నిరాకరించడం దేశ రాజకీయాల్లో కీలక మలుపుగా నిలిచింది. ఆ నిర్ణయం వెనుక కారణాలను తన తాజా పుస్తకం 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'లో ఆమె వివరించారు. ప్రధానిగా బాధ్యతలు చేపట్టేందుకు పార్టీలో అనుభవజ్ఞులైన నాయకులు చాలామంది ఉన్నప్పటికీ, నిస్వార్థత, నిజాయతీ, పాలనపై లోతైన అవగాహన కలిగిన వ్యక్తిగా మన్మోహన్ సింగ్‌ను ఎంపిక చేశానని తెలిపారు. 1990వ దశకంలో ఆర్థిక మంత్రిగా దేశంలో ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చిన ఆయనకు అపారమైన అనుభవం ఉందని పేర్కొన్నారు. పార్టీలోని ఏ వర్గానికీ ఆయన ప్రత్యేకంగా అనుబంధం లేకపోవడం, వామపక్షాల మద్దతుతో ప్రభుత్వం నడిపేందుకు ఆయన సరైన వ్యక్తి కావడం కూడా ఎంపికకు కారణమని వెల్లడించారు.

కుటుంబ భయం.. పదవికి దూరం!

ప్రధాని పదవిపై తన నిర్ణయాన్ని ముందుగానే పిల్లలు రాహుల్, ప్రియాంకతో చర్చించినట్లు సోనియా తెలిపారు. ఇందిరాగాంధీ హత్య, రాజీవ్‌గాంధీ దారుణ హత్యలతో కుటుంబం ఎదుర్కొన్న విషాదాన్ని గుర్తుచేసుకుంటూ, తాను ప్రధాని కావద్దని పిల్లలు కోరుకున్నారని చెప్పారు. తాను కూడా తొలుత ఆ పదవిని చేపట్టబోనని స్పష్టంగా చెప్పానని వెల్లడించారు. అయితే పార్టీ కార్యకర్తల ఆశలు, బాధ్యతలు తనను మరోవైపు ఆలోచించేలా చేశాయని వివరించారు. ఎన్నికల సమయంలో ప్రధాని అవుతారా అని అడిగిన ప్రతిసారీ స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా తప్పించుకున్నానని తెలిపారు. కొన్ని కూటమి పార్టీల నేతలు తనపై ఒత్తిడి తెచ్చి అంగీకరించాలని కోరినప్పుడు, వారి పట్టుదలతో 'సరే' అని చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడిందని గుర్తుచేసుకున్నారు. ఆ తర్వాత పిల్లలతోనూ ఈ విషయంపై చర్చించినట్లు పేర్కొన్నారు.

రాష్ట్రపతి భవన్‌కు మన్మోహన్‌తో..

2004 మే 18న మన్మోహన్ సింగ్‌తో కలిసి రాష్ట్రపతి భవన్‌కు వెళ్లిన సందర్భాన్ని సోనియా ప్రత్యేకంగా గుర్తుచేసుకున్నారు. తనతో వచ్చిన మన్మోహన్‌కు ప్రధాని పదవి గురించి అప్పటివరకు ఏమీ చెప్పలేదని, అందరూ తననే ప్రధానిగా భావిస్తున్నారని ఆయన కూడా అనుకున్నారని తెలిపారు. తొలుత ఈ బాధ్యత స్వీకరించేందుకు మన్మోహన్ సింగ్ విముఖత చూపినా, తర్వాత అంగీకరించేలా ఒప్పించామని వివరించారు. సీనియర్ నేతలతో సంప్రదింపుల అనంతరం ఆయన పేరును ప్రతిపాదించగా ఎవరూ అభ్యంతరం చెప్పలేదని పేర్కొన్నారు. ఆయన అనుభవాన్ని, నిజాయతీని ప్రశ్నించే అవకాశం ఎవరికీ లేదని సోనియా వ్యాఖ్యానించారు. దేశం ఆయన చేతుల్లో సురక్షితంగా ఉంటుందనే నమ్మకంతోనే ఈ నిర్ణయం తీసుకున్నానని పుస్తకంలో వెల్లడించారు.

ప్రధాని పదవిపై ప్రణబ్ ఆశ

- ఆశయం బయటపెట్టిన దాదా
- ఆశ్చర్యపోయానన్న సోనియా!

మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి ప్రధానమంత్రి కావాలనే బలమైన ఆకాంక్ష ఉండేదా? 2010లో తనతో జరిగిన ఓ సంభాషణలో ఆయన ప్రధాని పదవిపై ఆసక్తిని పరోక్షంగా వ్యక్తం చేయడం తనను ఆశ్చర్యానికి గురిచేసిందని కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ వెల్లడించారు. తన తాజా జ్ఞాపకాల పుస్తకం బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్‌లో ఈ ఆసక్తికర విషయాలను ప్రస్తావించారు. అప్పట్లో మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో కీలక మంత్రిగా ఉన్న ప్రణబ్ ముఖర్జీకి ఆర్థికమంత్రి పి. చిదంబరంతో తీవ్ర విభేదాలు ఉండేవి. కాంగ్రెస్ వ్యూహ కమిటీ సమావేశాల తర్వాత సోనియాతో ప్రత్యేకంగా మాట్లాడేవారు. అలాంటి ఓ సందర్భంలో తన అసంతృప్తిని వ్యక్తం చేస్తూ, నాయకత్వంలో మార్పు రావాల్సిన సమయం వచ్చిందని ప్రణబ్ సూచించారని సోనియా రాశారు. దీన్ని ప్రధాని కావాలనే ఆయన చిరకాల కోరికకు సంకేతంగా తాను అర్థం చేసుకున్నానని పేర్కొన్నారు.





సున్నితంగా తప్పించుకున్న సోనియా

ప్రణబ్ మాటలతో ఆశ్చర్యపోయినప్పటికీ, తాను వెంటనే సంభాషణను మరో అంశం వైపు మళ్లించానని సోనియా తెలిపారు. దీనిపై ప్రణబ్ నిరాశకు గురై ఉండవచ్చని, అయినప్పటికీ తనపై ఎప్పుడూ అసంతృప్తి చూపలేదని గుర్తుచేసుకున్నారు. ఇందిరా గాంధీ మంత్రివర్గంలో పనిచేసిన ప్రణబ్, మన్మోహన్ సింగ్‌తో ప్రభుత్వ నిర్వహణపై సమన్వయం చేసే కీలక బృందంలో సభ్యుడిగా ఉండేవారు. 2012లో రాష్ట్రపతి అయిన తర్వాత కూడా ఆయనను తరచూ కలిసేవారినని, అపారమైన జ్ఞానం, రాజకీయ అనుభవం ఉన్న వ్యక్తిగా గౌరవించానని సోనియా పేర్కొన్నారు. అయితే ఈ వ్యాఖ్యలపై ప్రణబ్ కుమార్తె షర్మిష్ఠ ముఖర్జీ ఘాటుగా స్పందించారు. రాజకీయాల్లో ఆశయం కలిగి ఉండటం నేరమా? అని ప్రశ్నించారు. దశాబ్దాల రాజకీయ అనుభవం, కష్టపడి పనిచేసే తత్వం, అద్భుతమైన మేధస్సు ఉన్న నాయకుడికి ప్రధాని కావాలనే కోరిక ఉండటంలో ఆశ్చర్యమేముందని నిలదీశారు.

మోదీతో దూరం.. మేనకాతో విభేదాలు

తన పుస్తకంలో సోనియా గాంధీ మరికొన్ని రాజకీయ, కుటుంబ విషయాలను కూడా వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీతో తనకు దాదాపుగా ఎలాంటి వ్యక్తిగత సంబంధాలు లేవని, అధికారిక కార్యక్రమాల్లో ఎదురైనప్పుడు పరస్పరం నమస్కారాలు మాత్రమే ఉంటాయని తెలిపారు. మోదీ తనతో కంటి చూపు కలపకుండా పక్కకు చూస్తుంటారని రాశారు. మరోవైపు మేనకా గాంధీతో కుటుంబ విభేదాలు క్రమంగా రాజకీయ వివాదాలుగా మారిన తీరును వివరించారు. సంజయ్ గాంధీతో మేనకా వివాహం తర్వాత మొదలైన విభేదాలు, ఇందిరాగాంధీకి ఆమె రాజకీయ కార్యకలాపాలపై ఏర్పడిన అసంతృప్తి చివరకు కుటుంబ బంధాలు తెగిపోయే పరిస్థితికి దారితీశాయని గుర్తుచేశారు. ఈ పుస్తకం నవంబర్ 10న పుస్తక దుకాణాల్లోకి రాగా, అధికారిక ఆవిష్కరణ నవంబర్ 16న జరిగే అవకాశం ఉంది. వ్యక్తిగత జ్ఞాపకాలతో పాటు కాంగ్రెస్ అంతర్గత రాజకీయాలపై సోనియా వెల్లడించిన అంశాలు ఇప్పుడు దేశ రాజకీయాల్లో చర్చకు దారితీస్తున్నాయి.



ప్రధాని పదవికి ఆశపడటం తప్పా?

- సోనియాపై ప్రణబ్ కుమార్తె ఎదురుదాడి

మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి ప్రధానమంత్రి కావాలనే ఆశయం ఉండటంలో ఆశ్చర్యపడాల్సిన అవసరం ఏముందని ఆయన కుమార్తె శర్మిష్ఠ ముఖర్జీ ప్రశ్నించారు. సోనియాగాంధీ తన తాజా పుస్తకం 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'లో ప్రణబ్ ప్రధాని పదవిపై ఆశయం వ్యక్తం చేసిన విషయాన్ని ప్రస్తావించడంపై ఆమె స్పందించారు. దశాబ్దాల రాజకీయ అనుభవం, పాలనపై పట్టు, కఠిన శ్రమ, అసాధారణ మేధస్సు ఉన్న వ్యక్తికి అత్యున్నత పదవిని ఆశించడంలో తప్పేముందని నిలదీశారు. ఒకసారి తాను అడిగినప్పుడు, 'సత్తా ఉన్న ప్రతి రాజకీయ నాయకుడికీ ప్రధాని కావాలనే ఆశయం ఉంటుంది' అని తన తండ్రి స్పష్టంగా చెప్పారని గుర్తుచేశారు.

వారసత్వం కాదు.. ప్రతిభతో ఎదిగారు!

తన తండ్రి నిరుపేద కుటుంబ నేపథ్యం నుంచి వచ్చి, స్వయంకృషి, ప్రతిభతో ఉన్నత స్థాయికి ఎదిగారని శర్మిష్ఠ తెలిపారు. ఎవరూ పదవులను పళ్లెంలో పెట్టి అందించలేదని, ముఖ్యంగా ప్రధాని పదవి కుటుంబ వారసత్వంగా దక్కలేదని పేర్కొన్నారు. గాంధీనెహ్రూ కుటుంబానికి చెందని వ్యక్తి ప్రధాని కావాలని ఆశించడం సోనియాకు ఆశ్చర్యం కలిగించిందా? అంటూ ప్రశ్నించారు. సోనియా తనపై ప్రణబ్ ఎప్పుడూ అసంతృప్తి పెంచుకోలేదని పేర్కొన్న వ్యాఖ్యపైనా ఆమె స్పందించారు. తండ్రి డైరీలు, ఆయనతో జరిగిన సంభాషణల ఆధారంగా చూస్తే, సోనియాపై కానీ మరెవరిపైనా కానీ ఆయనకు కక్ష లేదని స్పష్టం చేశారు. సోనియా నిర్ణయాల వెనుక ఉన్న కారణాలు, మానవ సహజమైన అభద్రతాభావాలను ప్రణబ్ అర్థం చేసుకున్నారని వివరించారు.

ప్రధాని అవకాశం దక్కకున్నా.. రాష్ట్రపతి పీఠం

2010లో అప్పటి ఆర్థిక మంత్రి పి.చిదంబరంతో ప్రణబ్‌కు తీవ్రమైన విభేదాలు వచ్చిన సందర్భంలో, నాయకత్వ మార్పు అవసరమని ఆయన సూచించారని సోనియా తన పుస్తకంలో రాశారు. ఆ మాటలను ప్రధాని పదవిపై ప్రణబ్ చిరకాల ఆకాంక్షకు సంకేతంగా భావించి, తాను చర్చను మరోవైపు మళ్లించానని వెల్లడించారు. ప్రణబ్ మేధస్సు, చరిత్రపై పట్టు, అంతర్జాతీయ వ్యవహారాలపై అవగాహనను ప్రశంసించిన సోనియా, ఆయనకు అప్పుడప్పుడు తీవ్ర కోపం వచ్చేదని కూడా పేర్కొన్నారు. 2012లో యూపీఏ తరఫున రాష్ట్రపతి అభ్యర్థిగా కాంగ్రెస్ ప్రణబ్‌ను నిలబెట్టగా, ఆయన దేశ అత్యున్నత రాజ్యాంగ పదవిని చేపట్టారు. అనంతరం ఆయనతో తరచూ మాట్లాడేవాడినని సోనియా పుస్తకంలో వివరించారు.

రెండుసార్లు క్యాన్సర్ ముప్పు

- ధైర్యంగా గెలిచిన సోనియా!

యూపీఏ రెండోసారి అధికారంలోకి వచ్చిన సమయంలో రాజకీయ బాధ్యతలతో పాటు వ్యక్తిగతంగా ఆరోగ్య సమస్యలు కూడా తనను తీవ్రంగా ఇబ్బంది పెట్టాయని కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ వెల్లడించారు. తన తాజా పుస్తకం 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'లో రెండుసార్లు క్యాన్సర్ ముప్పును ఎదుర్కొన్న అనుభవాలను వివరించారు. 2010లో ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆసుపత్రి వైద్యులు బ్రెస్ట్ క్యాన్సర్ అనుమానంతో వెంటనే శస్త్రచికిత్స చేయించుకోవాలని సూచించడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యానని తెలిపారు. అనారోగ్య వివరాలు మీడియాకు తెలియడం ఇష్టం లేక, ముంబైలోని టాటా మెమోరియల్ ఆసుపత్రికి వెళ్లకుండా మిలాన్ సమీపంలోని యూరోపియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీలో చికిత్స చేయించుకున్నట్లు చెప్పారు. ప్రముఖ వైద్యుడు ఉంబెర్టో వెరోనేసి పర్యవేక్షణలో జరిగిన ఆపరేషన్‌లో రెండు కణితులను తొలగించారని, అదనపు రేడియేషన్ చికిత్స అవసరం లేకుండా అనుసరించారని పేర్కొన్నారు. ఆ సమయంలో రాహుల్, ప్రియాంక, రాబర్ట్ వాద్రా, తన సోదరీమణులు అండగా నిలిచారని గుర్తుచేసుకున్నారు.

ఏడాదిలోనే మరో కణితి.. మళ్లీ ఆందోళన!

శస్త్రచికిత్స విజయవంతమైనప్పటికీ, ఏడాది తర్వాత వైద్య పరీక్షల్లో క్లోమగ్రంధి (ప్యాంక్రియాస్)లో మరో



కణితి బయటపడటం తనను, పిల్లలను కలవరపరిచిందని సోనియా తెలిపారు. మొదటిసారి వచ్చిన సమస్య మళ్లీ తిరగబెట్టిందేమోనని భయపడ్డామని చెప్పారు. వైద్యుల సలహా మేరకు వెంటనే ఆపరేషన్ చేయించుకోవాల్సి వచ్చిందని వెల్లడించారు. తొలుత అది న్యూరోఎండోక్రైన్ కణితి కావచ్చని భావించడంతో సుదీర్ఘ శస్త్రచికిత్స, ఆసుపత్రిలో ఎక్కువ రోజులు ఉండాల్సి వస్తుందని వైద్యులు అంచనా వేశారు. నెదర్లాండ్స్‌లోని రోటర్‌డామ్ ఎరాస్మస్ యూనివర్సిటీ మెడికల్ సెంటర్‌లో ప్రముఖ ప్యాంక్రియాస్ శస్త్రచికిత్స నిపుణుడు కాస్పర్ వాన్ ఫిజ్క్ చికిత్స అందించారు. వ్యాధి తీవ్రత ఆపరేషన్ తర్వాతే తెలుస్తుందని వైద్యులు చెప్పడంతో ప్రాణాలకు ముప్పు ఉంటుందేమోనని భయపడ్డానని సోనియా గుర్తుచేసుకున్నారు.

ముందుగానే గుర్తింపు.. తప్పిన ప్రాణాపాయం!

రెండో శస్త్రచికిత్స తర్వాత వైద్యుడు కాస్పర్ వాన్ ఫిజ్క్ చెప్పిన విషయం సోనియాకు ఊరటనిచ్చింది. కణితిని ముందుగానే గుర్తించడంతో ప్రమాదం తప్పిందని, అది ప్రారంభ దశలోని క్యాన్సర్ పూర్వ స్థితిలోనే ఉందని వైద్యుడు వివరించారు. దీంతో పెద్ద ముప్పు నుంచి బయటపడ్డానని ఆమె తెలిపారు. ఈ చికిత్స కోసం విదేశాలకు వెళ్లిన విషయం అప్పటి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌తో పాటు కొద్దిమంది సీనియర్ కాంగ్రెస్ నాయకులకు మాత్రమే తెలుసని వెల్లడించారు. అప్పటివరకు ఆస్తమా, అలర్జీలు, కడుపు సంబంధిత సమస్యలు తప్ప పెద్దగా ఆరోగ్య ఇబ్బందులు ఎదురుకాలేదని, రాజకీయ ఒత్తిడి పెరిగిన తర్వాత జీర్ణ సంబంధిత సమస్యలు ఎక్కువయ్యాయని పేర్కొన్నారు. వ్యక్తిగత గోప్యతను కాపాడుకుంటూనే రెండు తీవ్రమైన ఆరోగ్య సవాళ్లను ఎదుర్కొన్న తన అనుభవాలను సోనియా తొలిసారిగా పుస్తకంలో విపులంగా పంచుకున్నారు.

మోదీతో మాటలే లేవు

నమస్కారానికే పరిమితమైన పలకరింపు

ప్రధాని నరేంద్ర మోదీతో తనకు ఇప్పటివరకు పెద్దగా వ్యక్తిగత పరిచయం లేదని కాంగ్రెస్ ఎంపీ సోనియా గాంధీ వెల్లడించారు. తన తాజా పుస్తకం 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'లో మోదీతో తన అనుభవాలను వివరించారు. పార్లమెంట్ సమావేశాలు ముగిసిన తర్వాత స్పీకర్ ఛాంబర్‌లో జరిగే సమావేశాలు, ఇతర అధికారిక కార్యక్రమాల్లో ఇద్దరూ ఎదురుపడుతుంటామని చెప్పారు. అలాంటి సందర్భాల్లో మోదీకి నమస్కారం చేస్తే, ఆయన కూడా ప్రతినమస్కారం చేస్తారని, అయితే తనతో కళ్లలోకి చూస్తూ మాట్లాడకుండా చూపు పక్కకు తిప్పుకుంటారని రాశారు. గతంలో భిన్న పార్టీల నేతల మధ్య కూడా స్నేహపూర్వక సంబంధాలు ఉండేవని, ఇప్పటి పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని పేర్కొన్నారు. పుట్టినరోజు, నూతన సంవత్సర శుభాకాంక్షలు పరస్పరం తెలియజేసుకోవడం మినహా తమ మధ్య పెద్దగా సంభాషణ జరగలేదని తెలిపారు. ఆసుపత్రి నుంచి తిరిగి వచ్చిన సందర్భాల్లో మాత్రం మోదీ ఆరోగ్యం గురించి అడిగేవారని గుర్తుచేసుకున్నారు.

ఇద్దరివీ భిన్నమైన భారతీయ భావనలు..

భారత్ గురించి మోదీకి ఉన్న ఆలోచనలకు, తన అభిప్రాయాలకు చాలా తేడా ఉందని సోనియా పేర్కొన్నారు. తన కుటుంబం నుంచి స్వేచ్ఛ, సమానత్వం, భిన్నత్వాన్ని గౌరవించడం వంటి విలువలను నేర్చుకున్నానని చెప్పారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాల ప్రభావంతో మోదీ భారతదేశాన్ని భిన్నంగా చూస్తున్నారని విమర్శించారు. ఆయన దృష్టిలో ఒక మతం, సంస్కృతికి అధిక ప్రాధాన్యం ఉంటే, తాను మాత్రం లౌకికవాదం, సమ్మిళిత సంస్కృతి, సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తానని వివరించారు. ఇది వ్యక్తిగత పోరాటం



కాదని, దేశ భవిష్యత్తుపై రెండు భిన్నమైన దృక్పథాల మధ్య పోరాటమని అభివర్ణించారు. దేశంలోని పేదల కష్టాలు, సామాన్యుల జీవన పరిస్థితులు రాజకీయ చర్చల్లో ప్రతిబింబించాల్సిన అవసరం ఉందని తన అభిప్రాయాన్ని వెల్లడించారు.

నెహ్రూపై విమర్శలు.. కాంగ్రెస్‌పై గురి!

పార్లమెంట్‌లో మోదీ కొన్నిసార్లు బహిరంగ సభల్లో ఉపయోగించే కఠినమైన భాషనే వాడుతూ ప్రతిపక్షాలను విమర్శిస్తారని సోనియా ఆరోపించారు. ముఖ్యంగా తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూపై బీజేపీ నేతలు తీవ్ర విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు. 'కాంగ్రెస్ రహిత భారత్' నినాదం వెనుక ఆ పార్టీ విధానాలు, సిద్ధాంతాలపై వ్యతిరేకత ఉందని అభిప్రాయపడ్డారు. ఆర్ఎస్ఎస్ ప్రభావంతో మోదీ రాజకీయ దృక్పథం రూపుదిద్దుకుందని విమర్శించారు. తన అత్త ఇందిరా గాంధీ నుంచి భారతీయ సంప్రదాయాల్లోని భిన్నత్వాన్ని గౌరవించే విశ్వాసాన్ని నేర్చుకున్నానని తెలిపారు. మహాత్మాగాంధీ చెప్పిన అహింస, ధర్మం తన ఆలోచనలకు మార్గదర్శకాలని పేర్కొన్నారు. హిందూ సంప్రదాయాల్లోనే కుల వివక్షను ప్రశ్నించిన సంస్కరణవాదులు ఉన్నారని గుర్తుచేస్తూ, అందరినీ కలుపుకొని వెళ్లే భారతదేశమే తన ఆకాంక్ష అని సోనియా స్పష్టం చేశారు.

గుజరాత్ అల్లర్ల భయానక జ్ఞాపకాలు

చిన్నారి దుస్థితి చూసి చలించిన సోనియా!

2002 గుజరాత్ అల్లర్లు తన జీవితంలో ఎప్పటికీ మరిచిపోలేని విషాద ఘటనగా మిగిలిపోయాయని కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ వెల్లడించారు. తన తాజా జ్ఞాపకాల పుస్తకం 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్'లో నాటి భయానక పరిస్థితులను వివరించారు. అప్పట్లో లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న సోనియా, గుజరాత్‌లో జరుగుతున్న హింసను టీవీల్లో చూసి దిగ్భ్రాంతికి గురయ్యానని తెలిపారు. సహాయం కోసం ఫోన్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులను ఆదుకునేందుకు ప్రయత్నించినా, రాష్ట్ర యంత్రాంగం స్పందించలేదని ఆరోపించారు. ఫిబ్రవరి 27, 2002న గోద్రా వద్ద సబర్మతి ఎక్స్‌ప్రెస్ నాలుగు బోగీలకు నిప్పంటుకున్న ఘటనలో 58 మంది మరణించారు. అయోధ్య నుంచి అహ్మదాబాద్‌కు వస్తున్న రైలులో కరసేవకులు ప్రయాణిస్తున్నారు. ఈ ఘటన తర్వాత గుజరాత్‌లోని పలు ప్రాంతాలకు మత ఘర్షణలు వ్యాపించాయి. అల్లర్లలో ప్రధానంగా ముస్లింలు తీవ్రంగా నష్టపోయారని సోనియా పేర్కొన్నారు. అప్పటి ముఖ్యమంత్రి నరేంద్ర మోదీ పాలనలో రాష్ట్ర యంత్రాంగం పరిస్థితిని అదుపు చేయడంలో విఫలమైందని విమర్శించారు.

బాధిత శిబిరంలో హృదయవిదారక దృశ్యం

అఖిలపక్ష పార్లమెంటరీ బృందంలో భాగంగా సోనియా గాంధీ అహ్మదాబాద్‌లోని సహాయ శిబిరాలను సందర్శించారు. తొలుత రాష్ట్ర అధికారులతో సమావేశమైన బృందానికి బాధితుల కష్టాలపై మానవీయ స్పందన లేని నివేదిక అందించారని ఆమె విమర్శించారు. అనంతరం భద్రత పేరుతో బస్సులో తీసుకెళ్లి బాధితులు తలదాచుకున్న శిబిరాలను చూపించారు. అక్కడ మహిళలు, పురుషులు, చిన్నారులు తీవ్ర భయాందోళనలతో జీవిస్తున్న పరిస్థితిని చూసి చలించిపోయానని సోనియా రాశారు. ముఖ్యంగా ఓ తండ్రి తన అనారోగ్యంతో, బలహీనంగా ఉన్న చిన్నారిని ఎత్తుకుని బృందం ముందుకు వచ్చాడు. తన కుమార్తెపై పదేపదే అత్యాచారం జరిగిందని చెబుతూ, ఆమెను ఒకసారి చూడాలని, తమకు న్యాయం చేయాలని వేడుకున్నాడు. "నా బిడ్డకు ఇలా జరిగింది.. నేను ఇప్పుడు ఏం చేయాలి? ఎవరో ఒకరు సహాయం చేయండి" అంటూ ఆ తండ్రి కన్నీరుమున్నీరయ్యాడని సోనియా గుర్తుచేసుకున్నారు. ఆ దృశ్యం చూసి బృందంలోని సభ్యులంతా కుంగిపోయారని, తాను మాత్రం భయంతో మాటలు కూడా రాక కొన్ని ఓదార్పు మాటలు మాత్రమే చెప్పగలిగానని వివరించారు.

మోదీతో దూరం.. రాజకీయ విమర్శలు

అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి ముఖ్యమంత్రి మోదీని పదవి నుంచి తొలగిస్తారని ప్రచారం జరిగినా, సొంత పార్టీ ఒత్తిడితో వెనక్కి తగ్గారని సోనియా పేర్కొన్నారు. అల్లర్ల అనంతరం అమెరికా, బ్రిటన్ సహా కొన్ని ఐరోపా దేశాలు 2005లో మోదీకి వీసా నిరాకరించాయని, 12 ఏళ్ల తర్వాత ఆయన ప్రధానమంత్రి అయినప్పుడు అదే దేశాలు సత్కరించాయని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రధాని మోదీతో తనకు వ్యక్తిగతంగా పెద్దగా పరిచయం లేదని, అధికారిక సమావేశాల్లో నమస్కారాలకే తమ పలకరింపులు పరిమితమవుతున్నాయని కూడా పుస్తకంలో రాశారు. ఆయన తనతో ఎదురుపడినప్పుడు కంటిచూపు కలపకుండా పక్కకు చూస్తారని పేర్కొన్నారు. మరోవైపు ఈ పుస్తకంపై బీజేపీ విమర్శలు గుప్పించింది. 1984 సిక్కుల మారణకాండ, 1975 ఎమర్జెన్సీ, 26/11 ముంబై ఉగ్రదాడులపై సోనియా వైఖరిని ప్రశ్నించింది. బీజేపీ నేత సీఆర్ కేశవన్ పుస్తకానికి 'వైట్ వాషింగ్' అని పేరు పెట్టాల్సిందని వ్యాఖ్యానించారు. గుజరాత్ అల్లర్ల బాధితుల విషాదం నుంచి ప్రస్తుత రాజకీయ విభేదాల వరకు సోనియా జ్ఞాపకాలు మరోసారి దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి.


కోపంతో వణికించిన ఇందిర

- అత్త మనస్తత్వంపై సోనియా

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ కోపం ఎలా ఉండేదో, ఆమె కోడలు సోనియాగాంధీ తన తాజా పుస్తకం 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'లో ఆసక్తికరంగా వెల్లడించారు. పెళ్లయిన తొలినాళ్లలో అత్తగారి ఆగ్రహాన్ని చూసి తాను కుర్చీలోనే వణికిపోయేదాన్నని గుర్తుచేసుకున్నారు. ఇందిర కోపం సిబ్బందిని నిశ్చేష్టులను చేసేదని రాశారు. ఒకసారి ముఖ్యమైన సమావేశాన్ని గుర్తుచేయని సిబ్బందిలోని వ్యక్తిని గదిలో ఓ మూలన నిలబెట్టారని, మరో సందర్భంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడిని గోడవైపు చూస్తూ నిలబడాలని ఆదేశించారని వివరించారు. అంతేకాదు, తనకు నచ్చని వ్యక్తులతో ఇందిర రోజులు తరబడి మాట్లాడకుండా ఉండేవారని తెలిపారు.

రాజీవ్ ధైర్యం.. సోనియాకు ఊరట!

పార్లమెంట్‌లో ప్రతిపక్షాలతో తీవ్ర వాగ్వాదం జరిగిన రోజుల్లో ఇందిర భోజన సమయంలోనూ కోపం ప్రదర్శించేవారని సోనియా పేర్కొన్నారు. ఒకసారి ఆగ్రహంతో భోజనం చేస్తున్న పళ్లాన్ని బల్లకు అవతలి



వైపునకు తోసేశారని గుర్తుచేశారు. ఈ పరిణామాలు తనను తీవ్ర ఆందోళనకు గురిచేసేవని, తన తండ్రి కోపాన్ని గుర్తుకు తెచ్చేవని చెప్పారు. అయితే రాజీవ్, సంజయ్ మాత్రం మౌనంగా ఉండి పరిస్థితి సద్దుమణిగే వరకు వేచి చూసేవారని తెలిపారు. 'అమ్మ త్వరలోనే మామూలు స్థితికి వస్తుంది. నువ్వు అంతగా భయపడకు' అంటూ రాజీవ్ తనకు ధైర్యం చెప్పేవారని సోనియా వెల్లడించారు. సాధారణంగా కోపం తగ్గిన తర్వాత ఇందిర తన ప్రవర్తనపై పశ్చాత్తాపం వ్యక్తం చేసేవారని, అయితే నమ్మకద్రోహం చేసినవారిని మాత్రం ఎప్పటికీ క్షమించేవారు కాదని పేర్కొన్నారు.

మనవరాళ్లతో మారిన మనస్తత్వం..

కోపం నుంచి ఉపశమనం పొందేందుకు ఇందిర ఇంటి పనుల్లో నిమగ్నమయ్యేవారని సోనియా తెలిపారు. పాత ఫొటోలను తేదీల వారీగా సర్దడం, చీరలను వాటి ప్రత్యేకతల ఆధారంగా వేరు చేయడం, బంధువులకు ఇవ్వాల్సిన చీరలను ప్రత్యేకంగా కట్టడం వంటి పనులు చేసేవారని వివరించారు. మనవరాళ్లు పుట్టిన తర్వాత ఇందిరలో కోపం తగ్గుతూ వచ్చిందని సోనియా పేర్కొన్నారు. పిల్లలు పెరుగుతున్న కొద్దీ ఇందిర మనస్తత్వాన్ని అంచనా వేసేందుకు వారినే పంపించేవారని చెప్పారు. మనవరాళ్లు చిరునవ్వుతో పలకరించినా, అమాయకంగా ఓ ప్రశ్న అడిగినా ఇందిర ముఖంలో చిరునవ్వు కనిపించేదని, ఆమె కోపం వెంటనే కరిగిపోయేదని గుర్తుచేసుకున్నారు. రాజకీయాల్లో కఠినంగా కనిపించిన ఇందిరలో కుటుంబ అనుబంధాలు, మనవరాళ్లపై ప్రేమ మరో కోణాన్ని ఆవిష్కరించాయని సోనియా తన పుస్తకంలో వివరించారు.

సోనియా పుస్తకంపై బీజేపీ ఫైర్

'వైట్‌వాషింగ్' అంటూ విమర్శలు!

కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ రాసిన తాజా జ్ఞాపకాల పుస్తకం 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' రాజకీయ దుమారం రేపుతోంది. 1975లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీని సోనియా తన పుస్తకంలో తప్పిదంగా పేర్కొన్నప్పటికీ, దాన్ని సమర్థించే ప్రయత్నం చేశారని బీజేపీ తీవ్రంగా విమర్శించింది. ఈ పుస్తకానికి 'బిలాంగింగ్' బదులుగా 'వైట్ వాషింగ్' అని పేరు పెట్టాల్సిందని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సీఆర్ కేశవన్ ఎద్దేవా చేశారు. నెహ్రూగాంధీ కుటుంబం చేసిన చారిత్రక తప్పిదాలను కప్పిపుచ్చడం, కాంగ్రెస్ పాలనలో జరిగిన వివాదాస్పద నిర్ణయాలకు ముసుగు వేయడమే పుస్తకం ఉద్దేశమని ఎక్స్ వేదికగా ఆరోపించారు.

1984 నుంచి 26/11 వరకు ప్రశ్నలు

సోనియా గాంధీ బాబ్రీ మసీదు ఘటనపై కన్నీళ్లు పెట్టుకున్నానని చెప్పారని ప్రస్తావించిన కేశవన్, 1984లో సిక్కులపై జరిగిన మారణకాండ సమయంలో



ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో గురుద్వారాలపై దాడులు జరిగాయని, వేలాది మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. బాట్లా హౌస్ ఎన్‌కౌంటర్‌లో ఉగ్రవాదుల గురించి బాధపడ్డారని విమర్శిస్తూ, దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన సీఆర్‌పీఎఫ్ జవాన్ల కోసం ఎందుకు కన్నీరు పెట్టుకోలేదని నిలదీశారు. 26/11 ముంబై ఉగ్రదాడుల్లో అమాయకులు మరణించినప్పుడు సోనియా స్పందించారా? అప్పటి యూపీఏ ప్రభుత్వం ఎందుకు ప్రతీకార చర్యలు తీసుకోలేకపోయింది? అని ప్రశ్నించారు.

ఇందిర నిర్ణయాలపై రాజకీయ రగడ

ఎమర్జెన్సీ రాజ్యాంగాన్ని దెబ్బతీసి, ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాసిందని కేశవన్ పేర్కొన్నారు. అలాంటి నిర్ణయాన్ని సోనియా సమర్థించడం, సాధారణ విషయంగా చూపించడం ఆందోళనకరమన్నారు. దేశంలో దాదాపు 55 ఏళ్ల కాంగ్రెస్ పాలన ప్రజాస్వామ్య వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిందని విమర్శించారు. మరోవైపు, తన పుస్తకంలో సోనియా ఎమర్జెన్సీని తప్పిదంగా అంగీకరించడంతో పాటు, ఇందిరాగాంధీ కూడా తర్వాత అదే అభిప్రాయానికి వచ్చి ఉంటారని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ తర్వాత జరిగిన పరిణామాలకు సంజయ్ గాంధీని నియంత్రించి ఉంటే నష్టం తగ్గేదని కూడా అభిప్రాయపడ్డారు. చారిత్రక తప్పిదాలపై ఆత్మపరిశీలన చేస్తున్నామన్న కాంగ్రెస్ వాదనకు, బీజేపీ విమర్శలు రాజకీయ ప్రతిస్పందనగా మారాయి. సోనియా పుస్తకం విడుదలైన రోజే మొదలైన ఈ వివాదం దేశ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపింది.

ఎన్నికల కోసం కాదు

పదేళ్ల క్రితమే మొదలైన రచన... మనసులో మాట చెప్పేందుకే పుస్తకం!



రాజకీయాలకు అతీతంగా కుటుంబ కథ
2029 ఎన్నికలతో సంబంధం లేదన్న ఎన్.రామ్!

సోనియా గాంధీ రాసిన 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం 2029 లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తీసుకొచ్చింది కాదని ప్రముఖ పాత్రికేయుడు, 'ది హిందూ' మాజీ సంపాదకుడు ఎన్.రామ్ స్పష్టం చేశారు. పుస్తకం వెనుక ఉన్న ఉద్దేశాలను వివరించారు. దాదాపు పదేళ్ల క్రితమే సోనియా తన జీవితంలోని అనుభవాలను రాయడం ప్రారంభించారని, గత ఐదేళ్లుగా ఈ రచనపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారని తెలిపారు. మధ్యలో కొన్నిసార్లు రచన సజావుగా సాగిందని, మరికొన్ని సందర్భాల్లో వ్యక్తిగత పరిస్థితుల వల్ల ఆగిపోయిందని చెప్పారు. గాంధీ కుటుంబంపై ఇతరులు ఎన్నో పుస్తకాలు రాసినా, అందులో తమ కుటుంబ సభ్యుల అసలు వ్యక్తిత్వం కనిపించలేదనే భావన సోనియాలో ఉండేదన్నారు. అందుకే తనకు తెలిసిన కుటుంబాన్ని, తాను ప్రేమించిన వ్యక్తులను నిజాయతీగా పరిచయం చేయాలనుకున్నారని వివరించారు. ఇన్నాళ్లూ ఇతరులు తన కథ చెప్పారు.. ఇప్పుడు తన వంతు వచ్చిందన్నదే సోనియా ఆలోచన అని ఎన్.రామ్ పేర్కొన్నారు.

ప్రధాని పదవికి నో.. కుటుంబం ఆందోళన

2004లో ప్రధాని పదవిని తిరస్కరించిన ఘటన పుస్తకంలోని అత్యంత ఆసక్తికరమైన అంశాల్లో ఒకటని ఎన్.రామ్ వెల్లడించారు. తొలుత సోనియా ప్రధాని పదవిపై ఆసక్తి చూపకపోయినా, కాంగ్రెస్ నేతల ఒత్తిడితో ఒక దశలో అంగీకరించారని తెలిపారు. అయితే రాహుల్, ప్రియాంక గాంధీలు ఆమె ప్రధాని కావడాన్ని వ్యతిరేకించారు. తండ్రి రాజీవ్ గాంధీ హత్య తర్వాత కుటుంబంలో మరోసారి అలాంటి ప్రమాదం ఎదురవుతుందనే భయం వారిని వెంటాడిందని వివరించారు. చివరకు సోనియా పదవిని తిరస్కరించడం భారత రాజకీయ చరిత్రలో అసాధారణ నిర్ణయమని అభిప్రాయపడ్డారు. సంజయ్ గాంధీ మరణం తర్వాత ఇందిరాగాంధీ, రాజీవ్‌ను రాజకీయాల్లోకి రావాలని కోరడం, సోనియా అందుకు వ్యతిరేకించడం వంటి కుటుంబ విషయాలను కూడా పుస్తకంలో ప్రస్తావించారు. ఎమర్జెన్సీని స్వతంత్ర భారత చరిత్రలో చీకటి అధ్యాయంగా పేర్కొన్న సోనియా, జరిగిన పరిణామాలపై విచారం వ్యక్తం చేశారని ఎన్.రామ్ తెలిపారు. ఈ విషయంలో కాంగ్రెస్ తన బాధ్యతను మరింత స్పష్టంగా అంగీకరించాలని ఆయన అభిప్రాయపడ్డారు.

రాజీవ్ ప్రేమ నుంచి మోదీ రాజకీయాల వరకు

కేంబ్రిడ్జిలో రాజీవ్‌తో పరిచయం, ప్రేమ, వివాహం, రాజీవ్ హత్య తర్వాత రాహుల్, ప్రియాంక ఎదుర్కొన్న కష్టాలను సోనియా ఆత్మీయంగా వివరించారని ఎన్.రామ్ చెప్పారు. శరద్ పవార్, పి.ఏ. సంగ్మా, తారిక్ అన్వర్‌లు సోనియా విదేశీ మూలాలను ప్రశ్నిస్తూ కాంగ్రెస్ నాయకత్వాన్ని వ్యతిరేకించిన సందర్భాలను కూడా ప్రస్తావించారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌పై సోనియాకు ఉన్న గౌరవం, తమిళనాడు మాజీ సీఎం కరుణానిధిపై సాహిత్యాభిరుచి కారణంగా ఏర్పడిన అభిమానం పుస్తకంలో కనిపిస్తాయని తెలిపారు. మరోవైపు బీజేపీ, ఆర్ఎస్ఎస్, ప్రధాని మోదీ, ఎన్నికల సంఘం, ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ (ఎస్ ఐఆర్), ఓట్ల చోరీ ఆరోపణలపై సోనియా తన అభిప్రాయాలను వెల్లడించారని చెప్పారు. బీజేపీ అధికారంలో లేకపోయినా సంస్థలపై పడిన ప్రభావం కొనసాగుతుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారని వివరించారు. బోఫోర్స్ వివాదంలో రాజీవ్ కుటుంబం ఎలాంటి కమీషన్ తీసుకోలేదన్న వాదనను కూడా పుస్తకంలో ప్రస్తావించారు. రాజకీయ ఆరోపణల కంటే వ్యక్తిగత అనుభవాలు, కుటుంబ బంధాలు, చారిత్రక పరిణామాలే ఈ పుస్తకానికి ప్రధాన బలం అని ఎన్.రామ్ అభిప్రాయపడ్డారు.

రాజకీయ ఆశలు.. అన్నదమ్ముల మధ్య చిచ్చు

మేనక, సంజయ్ మధ్య విభేదాలు క్రమంగా పెరిగాయని, వారి వాగ్వాదాలు ఇంట్లో అందరికీ వినిపించే స్థాయికి చేరాయని సోనియా వివరించారు. 1977లో ఎమర్జెన్సీ అనంతరం కాంగ్రెస్ ఓడిపోవడం, ఇందిరాగాంధీ, సంజయ్ తమ నియోజకవర్గాల్లో పరాజయం పాలవడంతో కుటుంబంలో రాజకీయ ఒత్తిళ్లు పెరిగాయి. సంజయ్ రాజకీయ నిర్ణయాల్లో మేనక ప్రభావం ఎక్కువవుతోందని ఇందిర భావించేవారని సోనియా పేర్కొన్నారు. 1978 ఎన్నికల ఫలితాలకు సంజయ్ మొండితనం, తొందరపాటు నిర్ణయాలే కారణమని రాజీవ్ భావించారని తెలిపారు. ఒక సందర్భంలో తల్లి ఇందిర సమక్షంలోనే రాజీవ్ తన సోదరుడిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారని రాశారు. మేనక కుటుంబ సభ్యులపై విమర్శలు చేయడం, జర్నలిస్టుల ద్వారా తమపై కథనాలు ప్రచారం చేయించడం విభేదాలను మరింత పెంచాయని ఆరోపించారు.

సంజయ్ మరణంతో తెగిపోయిన బంధం

1980 జూన్ 23న విమాన ప్రమాదంలో సంజయ్ గాంధీ మరణించడంతో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. అప్పటికి మేనక వయసు 23 ఏళ్లు మాత్రమే కావడంతో ఆమెకు వెంటనే రాజకీయ బాధ్యతలు అప్పగించేందుకు ఇందిరాగాంధీ ఇష్టపడలేదని సోనియా పేర్కొన్నారు. చిన్నబిడ్డ వరుణ్ గాంధీని చూసుకుంటూ కొంతకాలం ఓపిక పట్టాలని సూచించారని తెలిపారు. అయితే మేనక రాజకీయంగా ముందుకు వెళ్లాలని భావించారని రాశారు. 1981 మార్చిలో వరుణ్ మొదటి పుట్టిన రోజు వేడుకలను ఇందిరకు రాజకీయ ప్రత్యర్థిగా ఉన్న వసుంధర రాజే నివాసంలో నిర్వహించడం మరో వివాదానికి కారణమైంది. అనంతరం ఇందిర లండన్‌లో ఉన్నసమయంలో మేనక తన వస్తువులను ఇంటి నుంచితరలించడం ప్రారంభించారు. తిరిగివచ్చిన ఇందిర, ఇంట్లో ఉండాలంటే కొన్ని విషయాల్లో వెనక్కి తగ్గాలని, లేదంటే వేరుగా ఉండాలని స్పష్టం చేశారు. చివరకు మేనక ఇంటిని విడిచిపెట్టారు. ఈ ఘటనను తనకు వ్యతిరేకంగా ప్రచార కార్యక్రమంగా మార్చారని సోనియా ఆరోపించారు. ఆ తర్వాత వరుణ్‌ను కలుసుకునే హక్కుల విషయంలోనూ గాంధీ కుటుంబం, మేనక మధ్య న్యాయపరమైన వివాదాలు కొనసాగాయని తన పుస్తకంలో వెల్లడించారు.



మేనకా–సోనియా మధ్య చిచ్చు

గాంధీ కుటుంబంలో కలహాల కథ!

గాంధీ కుటుంబంలో ఒకప్పుడు ఆత్మీయంగా మొదలైన బంధం.. చివరకు తీవ్ర విభేదాలకు దారి తీసింది. సంజయ్ గాంధీ భార్య మేనకా గాంధీతో తనకున్న అనుబంధం ఎలా దెబ్బతిన్నదో సోనియా గాంధీ తన తాజా జ్ఞాపకాల పుస్తకం 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్'లో వివరించారు. 1973 చివర్లో సంజయ్‌కు మేనక పరిచయమయ్యారని, అప్పటికి ఆమె వయసు 18 ఏళ్లు కూడా లేదని సోనియా గుర్తుచేసుకున్నారు. ఏడాదిలోపే వీరిద్దరి వివాహం జరగడంతో మేనక గాంధీ కుటుంబంలోకి అడుగుపెట్టారు. మొదట్లో ఆమె ఎంతో ఉత్సాహంగా, చలాకీగా మాట్లాడే అమ్మాయిగా కనిపించేవారని, ఇంట్లో చిన్న తోడికోడలు రావడం తనకు సంతోషాన్నిచ్చిందని సోనియా రాశారు. తన కుమార్తె ప్రియాంక కూడా మేనక గదిలో కూర్చుని ఆమె చెప్పే కథలను ఆసక్తిగా వినేదని పేర్కొన్నారు. అయితే కొంతకాలానికి ఇంట్లో చిన్నచిన్న అసంతృప్తులు మొదలయ్యాయి. సోనియాను 'బహురాణి', మేనకను 'చోటీ బహు' అని పిలవడం కూడా విభేదాలకు కారణమైందని, తాను ఇద్దరినీ సమానమైన కుటుంబ సభ్యులుగానే భావించానని సోనియా తెలిపారు.

దేశాన్ని నమ్మే యువతే
రేపటి భారతం!



ప్రకటనల్ని నమ్మాం..
పరాయి భావజాలాన్ని నమ్మాం!
మరి మన దేశాన్ని మనం
ఎందుకు నమ్మకూడదు?
పాశ్చాత్య భావజాలం కాదు..
భారతీయతే మన బలం!
ప్రముఖ కవి, రచయిత
డాక్టర్ పి. భాస్కర యోగి సందేశం



పసుపు, చందనం గుణాల కలయిక అంటూ సంతూర్‌ను నమ్మాం. చిన్నప్పటి నుంచి ఫెయిర్ అండ్ లవ్లీ వాడితే తెల్లగా అవుతారని చెప్పిన మాటలు నమ్మాం. ఇన్నేళ్ల యినా ఆ క్రీమ్ వాడిన వారిలో ఎంతమంది తెల్లగా మారారో తెలియదు. 'ది కంప్లీట్ మ్యాన్' అంటూ రేమండ్‌ను నమ్మాం. 'ది లైఫ్ సీక్రెట్' అంటూ లైఫ్‌బాయ్‌ను నమ్మాం. ప్రకటనలు చెప్పే మాటలను నమ్మడానికి సిద్ధంగా ఉన్న మనం, మన దేశాన్ని, మన సంస్కృతిని, మన చరిత్రను నమ్మే ఆలోచనకు ఎందుకు వెనుకాడుతున్నాం? ఈరోజు యువతలో దేశం పట్ల అలాంటి ఆలోచన పుట్టడం నిజంగా గొప్ప పరిణామం. ఉద్యోగాల కోసం జాబ్ చార్ట్ పట్టుకొని వెళ్లిన యువకులను ప్రశ్నించే వారు చాలామంది ఉంటారు. వారు ఏమి చదివారు? ఏం రాశారు? అని పరీక్షిస్తారు. కానీ మన యువతలోని జ్ఞాపకశక్తి, ప్రతిభ, భాషపై పట్టు, దేశ చరిత్రపై అవగాహనను గుర్తించాల్సిన సమయం వచ్చింది. ఒకసారి చదివిన విషయాన్ని గుర్తుపెట్టుకునే వ్యక్తిని ఏకసంతాగ్రాహి అంటారు. రెండుసార్లు చదివితే గుర్తుపెట్టుకునే వ్యక్తిని ద్విసంతాగ్రాహి అంటారు. మూడుసార్లు చదివి గుర్తుంచుకునే వ్యక్తిని త్రిసంతాగ్రాహి అంటారు. ఇంతటి జ్ఞాపకశక్తి ఉన్న యువతను కేవలం ఉద్యోగ అర్హతలతోనే అంచనా వేయడం ఎంతవరకు సమంజసం? యువతలోని సృజనాత్మకతను, ఆలోచనలను వెలికితీయాలి. వారి ప్రతిభకు సరైన వేదిక కల్పించాలి. దేశాన్ని నమ్మే మనస్తత్వం, మన మూలాలను తెలుసుకోవాలనే ఆసక్తి యువతలో పెరగడం భవిష్యత్తుకు శుభసూచకం.

అక్షరాల పుట్టుక.. భారతీయ భాషల అపార శక్తి!

ప్రపంచానికి అక్షర జ్ఞానాన్ని అందించిన గొప్ప సంప్రదాయం భారతీయ సంస్కృతిలో ఉందని ఈ ప్రసంగం గుర్తుచేస్తోంది. మనం అక్షరాభ్యాసం ప్రారంభించేటప్పుడు 'ఓం నమఃశివాయ సిద్ధం నమః' అని రాయించడం వెనుక ఒక ఆధ్యాత్మిక భావన ఉంది. శివుడి డమరుకం నుంచి వెలువడిన శబ్దాల ఆధారంగా మహేశ్వర సూత్రాలు ఏర్పడ్డాయని భారతీయ భాషా సంప్రదాయం చెబుతుంది. 'ఐఉణ్, ఋలృక్, ఏఓఙ్, ఐఔచ్' వంటి మహేశ్వర సూత్రాల ద్వారా సంస్కృత వర్ణమాల ధ్వనుల క్రమాన్ని వివరించారు. శబ్దాలను పరిశీలించి వాటికి అక్షర రూపం కల్పించడం భాషా పరిణామంలో గొప్ప ఆలోచన. మన తెలుగు భాషలోనూ అక్షరాల ఉచ్చారణకు ప్రత్యేకమైన శాస్త్రీయ పద్ధతి ఉంది. 'త, థ, ద, ధ' వంటి అక్షరాలు దంతాల సహాయంతో పలుకుతాం కాబట్టి వాటిని దంత్యాలు అంటారు. 'క, ఖ, గ, ఘ' వంటి అక్షరాలు గొంతు నుంచి వెలువడతాయి కాబట్టి కంఠ్యాలుగా పిలుస్తారు. 'ఇ, ఙ, ణ, న, మ' వంటి అక్షరాల్లో ముక్కు ద్వారా వెలువడే ధ్వనుల ప్రభావం ఉంటుంది. వీటిని అనునాసికాలు అంటారు. అంటే మన నోరు, నాలుక, దవడలు, పళ్లు, గొంతు కలిసి అక్షరాలను పలికిస్తాయి. మన భాష వెనుక కేవలం మాటలు లేవు.. ఒక శాస్త్రీయ వ్యవస్థ, గొప్ప జ్ఞాన సంపద ఉన్నాయి. ఇదే విషయాన్ని వివరిస్తూ, ఇతర దేశాల్లో పిల్లలకు పేర్లు పెట్టే సమయంలో వినిపించే శబ్దాలకు ప్రాధాన్యం ఇస్తారు. అలాంటప్పుడు మన ప్రాచీన సంప్రదాయంలో శబ్దాలకు, అక్షరాలకు ఉన్న ప్రాధాన్యాన్ని ఎందుకు తక్కువగా చూడాలి. అంతేకాదు, శ్లోకాలు, పద్యాలు, మంత్రాలు చదవడం వల్ల ఉచ్చారణ మెరుగుపడటంతో పాటు నోటి కండరాలు చురుకుగా పనిచేస్తాయన్నారు. భాషను కేవలం మాట్లాడటానికి మాత్రమే పరిమితం చేయకుండా, దాని వెనుక ఉన్న శాస్త్రాన్ని తెలుసుకోవాలని సూచించారు. భారతీయ భాషల గొప్పతనాన్ని ఆధునిక తరానికి అర్థమయ్యేలా చెప్పగలిగితే మన సాంస్కృతిక వారసత్వం మరింత బలపడుతుంది.

భగత్ సింగ్ త్యాగం.. యువతకు జాతీయతా స్ఫూర్తి!

ఈ ప్రసంగంలో అత్యంత ఉద్వేగభరితమైన అంశం భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల త్యాగం. బ్రిటిష్ ప్రభుత్వం ముగ్గురికీ ఉరిశిక్ష విధించిన సమయంలో భగత్ సింగ్ ను ఒక న్యాయవాది కలిసి, తన శిక్షను రద్దు చేసుకోవాలని కోరితే కనీసం అతని ప్రాణాలైనా మిగులుతాయని సూచించినట్లు ప్రసంగకర్త వివరించారు. అయితే భగత్ సింగ్ మాత్రం బ్రిటిష్ పాలకుల ముందు తలవంచడం కంటే దేశం కోసం ప్రాణాలర్పించడమే గొప్పదని భావించాడని చెప్పారు. ఉరిశిక్ష అమలు చేసే ముందు చివరి కోరిక అడిగినప్పుడు తమను ఉరి తీయకుండా తుపాకులతో కాల్చి చంపాలని కోరినట్లు ప్రసంగంలో ప్రస్తావించారు. భారతమాత ఒడిలోనే ప్రాణాలు విడవాలన్న వారి దేశభక్తిని గుర్తుచేశారు. ఈ దేశానికి కేవలం జీవించే మనుషులు కాదు.. సమాజానికి దిశానిర్దేశం చేసే మహనీయులు కావాలి. వివేకానందుడు, ఆది శంకరాచార్యుడు, రామానుజుడు, దయానంద సరస్వతి, నారాయణ గురువు వంటి ఆధ్యాత్మిక సంస్కర్తల నుంచి యువత స్ఫూర్తి పొందాలి. భారతీయ జ్ఞానాన్ని ఆధునిక ప్రపంచానికి పరిచయం చేయాల్సిన బాధ్యత యువతపై ఉందని ఈ ప్రసంగం స్పష్టం చేసింది. దేశభక్తి అంటే నినాదాలు మాత్రమే కాదు.. మన భాషను గౌరవించడం, మన చరిత్రను తెలుసుకోవడం, మన సంస్కృతిని కాపాడటం, సమాజానికి ఉపయోగపడే ఆలోచనలను ముందుకు తీసుకెళ్లడం కూడా. అదే భగత్ సింగ్ వారసులుగా ఎదగడానికి నిజమైన మార్గం.



1984 సిక్కుల ఊచకోత

సోనియా పుస్తకంపై బీజేపీ ఎదురుదాడి!

1984లో దేశాన్ని కుదిపేసిన సిక్కుల మారణకాండ ఇప్పుడు మరోసారి రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ తన తాజా పుస్తకం 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్'లో ఈ ఘటనకు సంబంధించి రాజీవ్ గాంధీతో పాటు కాంగ్రెస్ నాయకత్వాన్ని బాధ్యత నుంచి తప్పించే ప్రయత్నం చేశారని బీజేపీ ఆరోపించింది. ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో బీజేపీ సీనియర్ నేత హర్విందర్ సింగ్ ఫూల్కా ఈ విమర్శలు చేశారు. పుస్తకంలో ప్రస్తావించిన అంశాలు అధికారిక విచారణ కమిషన్ల నివేదికలకు పూర్తిగా విరుద్ధంగా ఉన్నాయని అన్నారు. ముఖ్యంగా సైన్యాన్ని రంగంలోకి దించడంలో జరిగిన జాప్యానికి అప్పటి ఆర్మీ చీఫ్ జనరల్ ఏఎస్ వైద్యాను బాధ్యుడిగా చూపించడం తప్పని అభ్యంతరం వ్యక్తం చేశారు.




సైన్యం మోహరింపులో జాప్యమెందుకు?

ఫూల్కా వెల్లడించిన వివరాల ప్రకారం, ఇందిరాగాంధీ హత్య జరిగిన అక్టోబర్ 31 రాత్రి నుంచి నవంబర్ 1 ఉదయం వరకు ఢిల్లీలో సుమారు 6,100 మంది సైనికులు అందుబాటులో ఉన్నారు. అయినప్పటికీ వారిని సకాలంలో రంగంలోకి దించలేదని మిశ్రా కమిషన్ నివేదిక పేర్కొందని తెలిపారు. నవంబర్ 1 ఉదయం 5,000 మంది సైనికులను ఢిల్లీ వీధుల్లో కవాతు చేయించి ఉంటే కనీసం 2,000 మంది సిక్కుల ప్రాణాలు కాపాడగలిగేవారని మిశ్రా, నానావతి కమిషన్లు అభిప్రాయపడ్డాయని గుర్తుచేశారు. సైన్యాన్ని సిద్ధంగా ఉంచడం ఆర్మీ చీఫ్ బాధ్యత మాత్రమేనని, సైన్యాన్ని పిలిపించి క్షేత్రస్థాయిలో మోహరించడం పరిపాలనా అధికారుల బాధ్యతని వివరించారు. ప్రధానిగా ఉన్న రాజీవ్ గాంధీ విఫలమైన అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. 'పెద్ద చెట్టు కూలితే భూమి కొద్దిగా కంపిస్తుంది' అంటూ రాజీవ్ చేసిన వ్యాఖ్యను కూడా ప్రస్తావించారు.

కాంగ్రెస్‌పై బీజేపీ నేతల విమర్శలు

కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ కూడా సోనియా గాంధీపై విమర్శలు గుప్పించారు. బాబ్రీ మసీదు, బాట్లా హౌస్ ఘటనలపై స్పందించే సోనియా గోద్రా, పహల్గామ్ ఘటనల విషయంలో ఎందుకు అదే విధంగా స్పందించలేదని ప్రశ్నించారు. నెహ్రూ హయాంలో టిబెట్ సమస్య, ఆర్టికల్ 370, 35ఏ వంటి అంశాలపై జరిగిన తప్పిదాలను కూడా పుస్తకంలో ప్రస్తావించాల్సిందని అన్నారు. బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ ఈ పుస్తకం కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాలను ప్రతిబింబిస్తోందని విమర్శించారు. 2029 ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు ఓటమి తప్పదని వ్యాఖ్యానించారు. 1984 సిక్కుల మారణకాండకు బాధ్యత ఎవరిది? సైన్యాన్ని సకాలంలో ఎందుకు మోహరించలేదు? అనే ప్రశ్నలతో సోనియా పుస్తకం ఇప్పుడు రాజకీయ చర్చకు కేంద్రంగా మారింది.



షర్మిలను కలిసిన ధ్రువకుమార్‌రెడ్డి..

కుమార్తె పెళ్లికి ఆహ్వానం



పులివెందుల కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జ్ మూలం రెడ్డి ధ్రువకుమార్ రెడ్డి ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డిని హైదరాబాద్ లోని లోటస్ పాండ్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా షర్మిల తన కుమార్తె వివాహానికి ధ్రువకుమార్ రెడ్డిని ఆహ్వానించారు. వివాహంతో పాటు రిసెప్షన్ కు కూడా హాజరై వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ ప్రత్యేకంగా ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ భేటీ సందర్భంగా ఇరువురి మధ్య ఆత్మీయ పలకరింపులు చోటుచేసుకున్నాయి. మర్యాదపూర్వకంగా జరిగిన ఈ సమావేశం స్నేహపూర్వక వాతావరణంలో సాగింది.

స్విమ్స్ లో ప్రముఖ ఈఎన్ టీ వైద్యుడి సేవలు



స్విమ్స్ లో నవంబర్ 5 నుంచి 7 వరకు విశాఖపట్నం నారాయణ మెడిసిటీకి చెందిన ప్రముఖ ఈఎన్ టీ నిపుణుడు డాక్టర్ వి. సురేష్ బాబు మూడు రోజుల పాటు స్వచ్ఛందంగా వైద్య సేవలు అందించారు. శ్రీవారి వైద్య సేవ కార్యక్రమంలో భాగంగా, స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ గుదారు జగదీష్ చొరవతో ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈఎన్ టీ విభాగంలో ఓపీ నిర్వహించి రోగులకు వైద్య పరీక్షలు, సలహాలు అందించడంతో పాటు అవసరమైన వారికి ప్రత్యేక శస్త్రచికిత్సలు చేశారు. వైద్య రంగంలో 42 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న డాక్టర్ సురేష్ బాబు, గుంటూరు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్, చండీగఢ్ పీజీఐఎంఈఆర్ లో ఈఎన్ టీ ఎంఎస్, డీఎన్ బీ పూర్తి చేశారు. ఎంబీబీఎస్ విద్యార్థులకు చెవి, ముక్కు, గొంతు వ్యాధుల లక్షణాలు, నిర్ధారణ, ఆధునిక చికిత్సా విధానాలపై ప్రత్యేక తరగతులు నిర్వహించారు.

ఏకగ్రీవాల పేరుతో ఓటు హక్కు హరించొద్దు!



వేంపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాల పేరుతో ప్రజలకు తమ ప్రతినిధులను ఎన్నుకునే అవకాశాన్ని దూరం చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కోఆర్డినేటర్, పులివెందుల నియోజకవర్గ ఇన్ చార్జ్ రహమతుల్లా అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏకగ్రీవాలను ప్రోత్సహించారని, అభివృద్ధి పనుల్లో అవినీతి ఆరోపణలు వచ్చినా ప్రజా సమస్యలు పరిష్కారం కాలేదని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే విధానాన్ని అనుసరించవద్దని కోరారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసి, తమ సమస్యలు పరిష్కరించే నాయకులను ఎన్నుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఏకగ్రీవాలతో ప్రజలకు ప్రశ్నించే అవకాశం తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

చంద్రగిరిలో రీపోలింగ్ కు వైసీపీ డిమాండ్



చంద్రగిరి నియోజకవర్గంలో ఎన్నికల సందర్భంగా టీడీపీ అధికార దుర్వినియోగానికి పాల్పడిందని వైసీపీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆరోపించారు. తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ, ఆరు జడ్పీటీసీ స్థానాల్లో మూడు వైసీపీ గెలిచిందని, మిగిలిన మూడు చోట్ల భారీ రిగ్గింగ్ జరిగిందని పేర్కొన్నారు. చంద్రగిరి, పాకాల, ఆర్సీపురం మండలాల్లో దొంగ ఓట్లు వేయించారని, మైనర్లను కూడా ఉపయోగించుకున్నారని ఆరోపించారు. రిగ్గింగ్ జరిగిన మూడు స్థానాల్లో రీపోలింగ్ కోసం హైకోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.



అక్కడ జననాయగన్.. ఇక్కడ జనసేనాని

- వివాహంపై రాజకీయ వివాదం
- విడాకులపై ప్రత్యర్థుల రాద్ధాంతం
- విమర్శలపై టేక్ ఇట్ ఈజీ పాలసీ
- పవన్, విజయ్‌ల చుట్టూ కాంట్రవర్సీ

ఒకే సినీ నేపథ్యం.. కోట్లాది మంది అభిమానులు.. రాజకీయాల్లోకి అడుగుపెట్టి సరికొత్త చరిత్ర సృష్టించిన ఇద్దరు హీరోలు! కానీ జీవిత ప్రయాణంలో ఇద్దరిదీ రెండు భిన్నమైన దారులు. తమిళనాడులో విజయ్.. పార్టీ పెట్టిన రెండేళ్లకే ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించి రాజకీయ సంచలనం సృష్టిస్తే.. ఆంధ్రప్రదేశ్‌లో పవన్ కళ్యాణ్ పదిహేనేళ్ల పోరాటం తర్వాత ఉప ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నారు. రాజకీయాల్లో ఒకరు వేగంగా శిఖరాన్ని అందుకుంటే.. మరొకరు ఎదురుదెబ్బలను అధిగమిస్తూ గమ్యాన్ని చేరుకున్నారు. ఇప్పుడు ఇద్దరి వ్యక్తిగత జీవితాల్లోనూ అనూహ్య మలుపులు! విజయ్ భార్య సంగీత విడాకుల పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. పవన్ కళ్యాణ్, అన్నా కొణిదెల మాత్రం పరస్పర అవగాహనతో వైవాహిక బంధానికి ముగింపు పలుకుతున్నట్లు ప్రకటించారు. ఒకరిది బంధాన్ని కొనసాగించేందుకు ప్రయత్నిస్తున్నట్టుగా పరిణామం.. మరొకరిది బంధానికి వీడ్కోలు! అసలు ఈ రెండు పరిణామాల వెనుక ఏముంది? విజయ్ రాజకీయ దూకుడు వెనుక రహస్యమేమిటి? పవన్ సుదీర్ఘ ప్రయాణం చెప్పే రాజకీయ పాఠమేమిటి? విజయ్ ఏపీ పర్యటనలో పవన్ కనిపించకపోవడం వెనుక ఏదైనా రాజకీయ సందేశం ఉందా? వ్యక్తిగత జీవితాల సంచలనాల మధ్య ఇద్దరి ముందున్న అసలైన సవాలేమిటి? అక్కడ అలా.. ఇక్కడ ఇలా.. ఎందుకలా? తెరవెనుక ఆసక్తికరమైన రాజకీయ పరిణామాలు.. లోతైన విశ్లేషణ..

దక్షిణ భారత రాజకీయాల్లో ఇద్దరు సినీ హీరోలు.. ఇద్దరికీ కోట్లాది మంది అభిమానులు.. ఇద్దరికీ ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు. సినిమాల్లో స్టార్‌డమ్ సంపాదించి రాజకీయాల్లోకి వచ్చిన ఈ ఇద్దరి ప్రయాణాలు ఇప్పుడు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. ఒకరు పార్టీ స్థాపించిన రెండేళ్లకే ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహిస్తే.. మరొకరు పదిహేనేళ్ల రాజకీయ పోరాటం తర్వాత ఉప ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నారు. వారే తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్. అయితే ఇప్పుడు వీరిద్దరి పేర్లు రాజకీయ విజయాల కారణంగానే కాకుండా వ్యక్తిగత జీవితాల్లో చోటుచేసుకున్న పరిణామాలతోనూ వార్తల్లో నిలిచాయి. విజయ్ భార్య సంగీత విడాకుల పిటిషన్‌ను ఉపసంహరించుకోగా.. పవన్ కళ్యాణ్, ఆయన భార్య అన్నా కొణిదెల పరస్పర అవగాహనతో విడిపోతున్నట్లు ఉమ్మడి ప్రకటన చేశారు. ఒకరి విషయంలో విడాకుల ప్రక్రియకు తాత్కాలికంగా తెరపడితే.. మరొకరి విషయంలో పదమూడేళ్ల వైవాహిక బంధం ముగుస్తున్నట్లు స్పష్టమైంది. ఈ రెండు పరిణామాలు ఒకేసారి వెలుగులోకి రావడంతో సహజంగానే పోలికలు మొదలయ్యాయి. అయితే వీటిని కేవలం కుటుంబ వ్యవహారాలుగా చూడటం సరిపోదు. సినిమా రంగంలో సంపాదించిన ప్రజాదరణను రాజకీయ శక్తిగా మార్చుకోవడం, వ్యక్తిగత జీవితాన్ని ప్రజా జీవితానికి దూరంగా ఉంచుకోవడం, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల అంచనాలను అందుకోవడం.. ఇలా ఇద్దరి ప్రయాణాల్లో అనేక ఆసక్తికరమైన కోణాలున్నాయి. విజయ్ రాజకీయంగా వేగంగా ఎదిగారు. పవన్ ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని అధికారంలోకి వచ్చారు. ఒకే తరహా అభిమాన బలం ఉన్నప్పటికీ ఇద్దరి రాజకీయ మార్గాలు పూర్తిగా భిన్నంగా సాగాయి. కుటుంబ జీవితాల్లోనూ ఇప్పుడు విభిన్న పరిణామాలు కనిపిస్తున్నాయి. అందుకే ఈ ఇద్దరి ప్రయాణాలను పోల్చి చూసేటప్పుడు వ్యక్తిగత నిర్ణయాలు, రాజకీయ నేపథ్యాలు, ప్రజా బాధ్యతలను విడివిడిగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

• అభిమాన పరిచయాల నుంచి వైవాహిక బంధాల వరకు!

విజయ్, పవన్ కళ్యాణ్ ఇద్దరి జీవితాల్లోనూ సినిమా రంగం కీలక పాత్ర పోషించింది. విజయ్‌కు సంగీతతో పరిచయం 1996లో పూవే ఉనక్కాగ సినిమా సమయంలో ఏర్పడింది. అభిమానిగా విజయ్‌ను కలిసిన సంగీతతో పరిచయం క్రమంగా ప్రేమగా మారింది. 1998లో వివాహ రిజిస్ట్రేషన్ జరగగా, 1999లో చెన్నైలో సంప్రదాయబద్ధంగా వివాహ వేడుక నిర్వహించారు. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు. మరోవైపు పవన్ కళ్యాణ్‌కు అన్నా లెజినోవాతో తీన్ మార్ సినిమా సమయంలో పరిచయం ఏర్పడింది. 2013 సెప్టెంబరులో వీరిద్దరూ వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా విజయ్ కుటుంబ జీవితంలో దూరం పెరిగిందనే ప్రచారం సాగింది. సినిమా కార్యక్రమాలు, రాజకీయ వేదికలపై సంగీత కనిపించకపోవడం చర్చకు దారితీసింది. చివరకు 2026 ఫిబ్రవరిలో సంగీత విడాకుల పిటిషన్ దాఖలు చేశారు. అందులో మానసిక వేధింపులు, వివాహేతర సంబంధం వంటి ఆరోపణలు చేశారు. భరణం, నివాస హక్కుల కోసం కూడా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మరోవైపు పవన్ కళ్యాణ్, అన్నా కొణిదెల వైవాహిక బంధానికి ముగింపు పలకాలని నిర్ణయించుకున్నారు. నవంబరు 9 రాత్రి విడుదల చేసిన ఉమ్మడి ప్రకటనలో పరస్పర అవగాహన, గౌరవంతో విడిపోతున్నట్లు తెలిపారు. వివాహ బంధం ముగిసినా స్నేహితులుగా కొనసాగుతామని, పిల్లల పట్ల బాధ్యతాయుతమైన తల్లిదండ్రులుగా ఉంటామని స్పష్టం చేశారు. విడిపోవడానికి గల కారణాలను మాత్రం వెల్లడించలేదు. ఇక్కడ ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. బహిరంగ కార్యక్రమాల్లో కలిసి కనిపించకపోవడం, సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు లేకపోవడం ఆధారంగా కుటుంబ బంధాల పరిస్థితిని అంచనా వేయలేం. అదే విధంగా విడాకుల పిటిషన్ ఉపసంహరణ అంటే తప్పనిసరిగా భార్యాభర్తలు తిరిగి కలిసిపోయారని అర్థం కాదు.



• విజయ్‌కు రెండేళ్లలో సీఎం.. పవన్‌కు పదిహేనేళ్ల పోరాటం!

వ్యక్తిగత జీవితాల్లో భిన్న పరిణామాలు ఎదుర్కొంటున్న ఈ ఇద్దరి రాజకీయ ప్రస్థానాలు కూడా ఆసక్తికరంగా ఉన్నాయి. విజయ్ 2024లో తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీని స్థాపించారు. సినీ అభిమానుల బలాన్ని రాజకీయ ఓట్లుగా మార్చే లక్ష్యంతో ఎన్నికల బరిలోకి దిగారు. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే 108 స్థానాలు సాధించి అతిపెద్ద పార్టీగా అవతరించింది. డీఎంకే 59 స్థానాలు, అన్నాడీఎంకే 47 స్థానాలు సాధించాయి. అయితే 234 స్థానాలున్న అసెంబ్లీలో ప్రభుత్వ ఏర్పాటుకు 118 మంది సభ్యుల మద్దతు అవసరం. దీంతో విజయ్ పార్టీకి మరో పది స్థానాల మద్దతు అవసరమైంది. కాంగ్రెస్, వీసీకే, ఐయూఎంఎల్, వామపక్షాల సహకారంతో అవసరమైన సంఖ్యాబలాన్ని సమకూర్చుకున్నారు. మే 10న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. పార్టీ పెట్టిన రెండేళ్లలోనే ముఖ్యమంత్రి కావడం తమిళ రాజకీయాల్లో సంచలన పరిణామంగా నిలిచింది. పవన్ కళ్యాణ్ రాజకీయ ప్రయాణం మాత్రం పూర్తిగా భిన్నం. 2014లో జనసేన పార్టీని ప్రారంభించారు. 2019 ఎన్నికల్లో రెండు స్థానాల్లో పోటీ చేసి ఓటమి చవిచూశారు. ఆ ఎన్నికల్లో పార్టీ ఒక్క అసెంబ్లీ స్థానం మాత్రమే దక్కించుకుంది. అయినప్పటికీ రాజకీయాలను వదిలిపెట్టకుండా ప్రజల్లో తిరుగుతూ వివిధ సమస్యలపై పోరాటం కొనసాగించారు. 2024 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీతో కలిసి కూటమిగా పోటీ చేశారు. జనసేన పోటీ చేసిన మొత్తం 21 స్థానాల్లోనూ విజయం సాధించింది. పవన్ కళ్యాణ్ పిఠాపురం నుంచి గెలిచి ఉప ముఖ్యమంత్రి అయ్యారు. అంటే విజయ్ తక్కువ సమయంలోనే అధికారాన్ని అందుకుంటే.. పవన్ సుదీర్ఘ రాజకీయ పోరాటం తర్వాత కీలక పదవిని సాధించారు. ఈ వ్యత్యాసానికి అభిమానుల సంఖ్య ఒక్కటే కారణం కాదు. రెండు రాష్ట్రాల రాజకీయ చరిత్ర, సామాజిక పరిస్థితులు, పార్టీ వ్యవస్థలు, ఎన్నికల వ్యూహాలు కూడా కీలక పాత్ర పోషించాయి. తమిళనాడులో ఎంజీఆర్, జయలలిత వంటి సినీ ప్రముఖులు రాజకీయాల్లో విజయవంతమైన చరిత్ర ఉంది. సినిమా అభిమానాన్ని రాజకీయ మద్దతుగా మార్చుకునే సంప్రదాయం అక్కడ బలంగా కనిపిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం టీడీపీ, వైసీపీ వంటి బలమైన ప్రాంతీయ పార్టీలతో పాటు కుల సమీకరణాలు, నియోజకవర్గాల రాజకీయాలు, కూటముల ప్రభావం ఎన్నికల ఫలితాలను నిర్ణయిస్తాయి. అందువల్ల విజయ్, విజయాన్ని పవన్ ప్రయాణంతో నేరుగా పోల్చడం కంటే రెండు రాష్ట్రాల రాజకీయ నేపథ్యాలను అర్థం చేసుకోవడం ముఖ్యం.

• విడాకుల పరిణామాలు.. రాజకీయ విజయాలపై ప్రభావం ఎంత?

విజయ్ కుటుంబ వివాదం రాజకీయాల్లోకి ప్రవేశించే సమయంలోనే చర్చకు వచ్చింది. 2026 ఆగస్టు 7న సంగీత వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చెంగల్పట్టు ఫ్యామిలీ కోర్టుకు హాజరై విడాకుల పిటిషన్‌ను కొనసాగించదలచుకోలేదని తెలిపారు. విజయ్ తరఫు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేయకపోవడంతో కోర్టు పిటిషన్ ఉపసంహరణకు అనుమతించింది. అవసరమైతే భవిష్యత్తులో మళ్లీ పిటిషన్ దాఖలు చేసుకునే అవకాశం కూడా కల్పించింది. ఈ పరిణామం తర్వాత కుటుంబ సభ్యుల జోక్యంతో సమస్య పరిష్కారమైందని, ఇద్దరి మధ్య రాజీ కుదిరిందని కొన్ని వార్తలు వెలువడ్డాయి. అయితే భార్యాభర్తలు తిరిగి కలిసినట్లు అధికారిక ప్రకటన వెలువడలేదు. కాబట్టి పిటిషన్ ఉపసంహరణను వైవాహిక బంధం పూర్తిగా పునరుద్ధరించబడిందనే నిర్ణయానికి ఆధారంగా తీసుకోలేం. మరోవైపు పవన్ కళ్యాణ్-అన్నా కొణిదెల విడిపోవాలనే నిర్ణయాన్ని ఉమ్మడిగా ప్రకటించారు. పరస్పర గౌరవంతో విడిపోతున్నామని, పిల్లల భవిష్యత్తుకు ఇద్దరూ బాధ్యత వహిస్తామని వెల్లడించారు. ఈ రెండు పరిణామాల మధ్య స్పష్టమైన తేడా ఉంది. ఒకరి విషయంలో విడాకుల పిటిషన్ ఉపసంహరణ జరిగింది. మరొకరి విషయంలో వైవాహిక బంధానికి ముగింపు పలకాలని నిర్ణయం వెలువడింది. ఈ అంశాలను రాజకీయ విజయాలు, వైఫల్యాలతో ముడిపెట్టడానికి ఎలాంటి ఆధారాలు లేవు. విజయ్ కుటుంబ వివాదం కొనసాగుతున్న సమయంలోనూ ఆయన పార్టీకి ఎన్నికల్లో భారీ ప్రజా మద్దతు లభించింది. అంటే వ్యక్తిగత జీవితంలో ఎదురయ్యే సమస్యలు రాజకీయ నాయకుడి ఎన్నికల విజయాన్ని తప్పనిసరిగా నిర్ణయించవని చెప్పవచ్చు. అదే విధంగా పవన్ వ్యక్తిగత జీవితంలో తీసుకున్న నిర్ణయం ఆయన రాజకీయ సామర్థ్యానికి కొలమానం కాదు. అయినప్పటికీ ప్రజా జీవితంలో ఉన్న నాయకుల కుటుంబ వ్యవహారాలు సహజంగానే చర్చకు వస్తుంటాయి. అభిమానులు, రాజకీయ ప్రత్యర్థులు వాటిని తమదైన కోణంలో విశ్లేషిస్తారు. కానీ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆరోపణలను నిర్ధారిత వాస్తవాలుగా ప్రచారం చేయడం సరికాదు. కుటుంబ బంధాలు వ్యక్తుల మధ్య ఉండే అంశాలు. వాటిపై నిర్ణయాలు తీసుకునే హక్కు కూడా సంబంధిత వ్యక్తులకే ఉంటుంది. రాజకీయ నాయకులుగా వారి పనితీరును మాత్రం ప్రజా సమస్యల పరిష్కారం, పాలనా నిర్ణయాలు, ఎన్నికల హామీల అమలు ఆధారంగా అంచనా వేయాలి.

•విజయ్ ఎదుగుదలపై పవన్ వ్యాఖ్యలు.. ఏపీ పర్యటనలో కొత్త చర్చ!

విజయ్ ముఖ్యమంత్రి కావడంతో పవన్ కళ్యాణ్‌తో పోలికలు సోషల్ మీడియాలో మరింత పెరిగాయి. రెండేళ్లలో విజయ్ సీఎం అయితే, పవన్‌కు పదిహేనేళ్లు ఎందుకు పట్టిందనే ప్రశ్నలు వినిపించాయి. ఈ పోలికలపై మే 16న మంగళగిరిలో పవన్ స్పందించారు. తమిళనాడు రాజకీయ పరిస్థితులు వేరని, ఆంధ్రప్రదేశ్ రాజకీయ పరిస్థితులు వేరని స్పష్టం చేశారు. పొరుగింట్లో పెళ్లి జరిగితే పిల్లలు హడావుడి చేసినట్లు కొందరు వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు. 2019 ఎన్నికల్లో తాను ఎదుర్కొన్న ఓటములు, అప్పటి రాజకీయ పరిస్థితులను గుర్తుచేశారు. మే 26న మరో సందర్భంలో తమిళ రాజకీయాలను చూస్తుంటే కొంత అసూయ కలుగుతోందని నవ్వుతూ వ్యాఖ్యానించారు. కట్‌అవుట్లు, హోలోగ్రామ్‌లతో వారు గెలిచారని, తాను పదిహేనేళ్లుగా వీధుల్లో తిరిగానని చెప్పారు. ఈ వ్యాఖ్యలను కేవలం అసూయగా చూడటం సరైన విశ్లేషణ కాదు. తన రాజకీయ ప్రయాణంలో ఎదురైన కష్టాలను గుర్తుచేస్తూనే, తమిళనాడులో అభిమానుల సమీకరణ విజయ్‌కు ఎలా ఉపయోగపడిందో పవన్ వివరించారు. అభిమానులంతా ఒకే రాజకీయ దిశలో నిలబడితేనే విజయానికి అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో విజయ్ ఆంధ్రప్రదేశ్ పర్యటన కూడా చర్చకు వచ్చింది. అక్టోబరు 13న తమిళనాడు ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి రాష్ట్రానికి వచ్చిన విజయ్ ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. అనంతరం ఉండవల్లిలో చంద్రబాబుతో సమావేశమయ్యారు. చెన్నై-తాగునీటి అవసరాలు, తెలుగు గంగ ప్రాజెక్టు, గోదావరి-కావేరీ అనుసంధానం వంటి అంశాలపై చర్చించారు. అనంతరం విజయవాడ ఉత్సవ్ 2.0లో పాల్గొన్న విజయ్ తెలుగులో ప్రసంగించి ఆకట్టుకున్నారు. చంద్రబాబు ఆయన రాజకీయ ఎదుగుదలను ప్రశంసించారు. అయితే ఈ పర్యటనలో పవన్ కళ్యాణ్ కనిపించకపోవడం అభిమానుల మధ్య చర్చకు దారితీసింది. విజయ్‌ను పవన్ కలుస్తారనే వార్తలు వచ్చినప్పటికీ భేటీ జరిగినట్లు అధికారిక సమాచారం లేదు. విజయ్, సీఎం స్థాయి సమావేశానికే పరిమితమయ్యారా? అనే ప్రశ్నలు వినిపించాయి. అయితే ఒక ముఖ్యమంత్రి మరో ముఖ్యమంత్రిని కలిసినప్పుడు ఉప ముఖ్యమంత్రి తప్పనిసరిగా ఉండాలనే నిబంధన లేదు. కేవలం పవన్ కనిపించలేదనే కారణంతో రాజకీయ విభేదాలున్నాయని నిర్ణయించలేం.

• రాజకీయాలకంటే పెద్దది ప్రజలతో బంధం!

ఇద్దరి ముందున్న అసలు సవాలు రాజకీయ పాలనలోనే ఉంది. విజయ్‌కు 108 స్థానాలతో ప్రజల మద్దతు లభించినప్పటికీ ప్రభుత్వాన్ని నడిపించడానికి మిత్రపక్షాల సహకారం అవసరం. అసెంబ్లీలో సమన్వయం, నిరుద్యోగ సమస్య పరిష్కారం, విద్య, వైద్యం, రైతుల సంక్షేమం, పారిశ్రామిక అభివృద్ధి వంటి అంశాల్లో తనదైన ముద్ర వేయాల్సి ఉంది. సినిమా తెరపై హీరోకు అభిమానులు చప్పట్లు కొడతారు. ప్రభుత్వంలో మాత్రం ప్రతి నిర్ణయానికి ప్రజలు సమాధానం కోరతారు. పవన్ కళ్యాణ్ కూడా జనసేనకు వచ్చిన 21 స్థానాల విజయాన్ని పార్టీ సంస్థాగత బలంగా మార్చుకోవాలి. కూటమిలో తన పాత్రను సమర్థంగా నిర్వహిస్తూ ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో భాగస్వామ్యం కావాలి. అభిమాన సంఘాల పరిధిని దాటి గ్రామస్థాయి నుంచి ప్రజా సమస్యలపై పనిచేసే రాజకీయ సంస్థగా జనసేనను బలోపేతం చేయాలి. ఇద్దరి రాజకీయ మార్గాలు వేరైనా ప్రజల అంచనాలు మాత్రం ఒక్కటే. అభిమానుల సంఖ్య పాలనకు కొలమానం కాదు. కట్‌అవుట్లు, హోలోగ్రామ్‌లు ప్రజాదరణను చూపించవచ్చు. కానీ ప్రజలకు అవసరమైన తాగునీరు, రహదారులు, ఉద్యోగాలు, విద్య, వైద్యం అందించినప్పుడే నాయకత్వానికి గుర్తింపు లభిస్తుంది. విజయ్ వేగంగా అధికారంలోకి వచ్చారు. పవన్ సుదీర్ఘ పోరాటం తర్వాత అధికారంలో భాగస్వామి అయ్యారు. ఇప్పుడు ఇద్దరూ తమ పనితీరుతో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలి. ఒకరి కుటుంబంలో పిటిషన్ ఉపసంహరణ జరిగింది. మరొకరి కుటుంబంలో విడిపోవాలనే నిర్ణయం వెలువడింది. ఈ వ్యక్తిగత పరిణామాలు వారి రాజకీయ భవిష్యత్తును నిర్ణయించలేవు. కుటుంబ బంధాలు వ్యక్తిగతం.. ప్రజలతో ఏర్పడిన రాజకీయ బంధం మాత్రం బాధ్యతతో కూడుకున్నది. ముఖ్యమంత్రి అయినా, ఉప ముఖ్యమంత్రి అయినా ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాల్సిందే. అందుకే ఈ కథలో అసలు ప్రశ్న విజయ్ ఎంత వేగంగా ఎదిగారు? పవన్ ఎంతకాలం పోరాడారు? అన్నది కాదు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని ఎవరు ఎంతవరకు నిలబెట్టుకుంటారన్నదే అసలైన పరీక్ష. అక్కడ విజయ్.. ఇక్కడ పవన్.. మార్గాలు వేరు, మలుపులు వేరు. కానీ ప్రజల ముందు నిరూపించుకోవాల్సిన బాధ్యత మాత్రం ఒక్కటే!



తండ్రి రూపం.. తండ్రి ఆహార్యం.. తండ్రి నేర్పిన ఆధ్యాత్మిక తత్వాలు! దివంగత పీఠాధిపతి శ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వరస్వామివారి వారసత్వాన్ని తనలో ప్రతిబింబించుకుంటున్న నొస్సం వీరభద్రస్వామి ఇప్పుడు బ్రహ్మంగారి మఠం పీఠాధిపత్య వివాదంలో కీలకంగా మారారు. చిన్నతనం నుంచే తండ్రి వద్ద బ్రహ్మంగారి తత్వాలు నేర్చుకుని, సంగీతంతో వాటిని ఆలపిస్తూ, ఉన్నత విద్యను అభ్యసించి, తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాల్లోనూ కాలజ్ఞాన సందేశాలను ప్రచారం చేస్తున్న ఆయన ప్రయాణం ప్రత్యేకం. తల్లికి కిడ్నీ దానం చేసిన కుటుంబ అనుబంధం నుంచి ఆలయ సేవలు, అన్నదానాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల వరకు ఆయన జీవితంలో ఎన్నో కోణాలున్నాయి. కానీ ఇప్పుడు అసలు ప్రశ్న ఒక్కటే.. తండ్రి తనను వారసుడిగా ఎంపిక చేశారని చెబుతున్న వీరభద్రస్వామికి పీఠం దక్కుతుందా? సోదరుడి తాత్కాలిక నియామకాన్ని హైకోర్టు రద్దు చేయడంతో కొత్త నియామక ప్రక్రియకు తెరలేచింది. అయితే కోర్టు ఆయనను పీఠాధిపతిగా ప్రకటించలేదు. వీలునామా వాదన, ఆధ్యాత్మిక అర్హతలు, మఠ సంప్రదాయాలు, శిష్యుల అభిప్రాయాలు.. అన్నీ ఇప్పుడు కీలకం. వారసత్వ పోరాటంలో ఎవరి వాదనకు గుర్తింపు లభిస్తుంది? తండ్రి అడుగుజాడల్లో సాగుతున్న వీరభద్రస్వామికి అసలైన పరీక్ష మొదలైంది!



దాదాపు నాలుగు దశాబ్దాల చరిత్ర కలిగిన బ్రహ్మంగారి మఠం పీఠాధిపత్య వివాదంలో మరో వారసుడి పేరు రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాదు ఇపుడు దేశవ్యాప్త చర్చగా మారింది. అంతేకాదు కాలజ్ఞాని తెలిసిన మొత్తం ప్రపంచ నలుమూలలకు ఈ అంశం ప్రధాన చర్చగా మారింది. ఆ పేరే శ్రీ వీరభద్రస్వామి. అయితే వీరభద్రస్వామి పరిచయం కేవలం వారసత్వ హక్కులకే పరిమితం కాదు. తండ్రి నుంచి నేర్చుకున్న బ్రహ్మంగారి తత్వాలు.. చిన్ననాటి నుంచి అలవడిన సంగీతాభిరుచి.. ఉన్నత విద్య.. ఆధ్యాత్మిక ప్రచారం.. భక్తులతో అనుబంధం.. ఇలా ఆయన ప్రయాణంలో ప్రత్యేకతలు ఎన్నో ఉన్నాయి. పూర్వపు పీఠాధిపతి శ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వరస్వామివారి రూపాన్ని, ఆధ్యాత్మిక వారసత్వాన్ని తనలో చూసుకుంటున్నామని భక్తబృందంతో పాటుగా అభిమానులు చెబుతున్నారు. ఇప్పుడు హైకోర్టు తాజా ఉత్తర్వులతో ఆయన పేరు మరోసారి చర్చలోకి రావడంతో బ్రహ్మంగారి మఠం భవిష్యత్తుపై ఆసక్తి పెరిగింది. కొంతమంది వ్యక్తులను వారి పేరుతో గుర్తిస్తారు. మరికొందరిని వారి వ్యక్తిత్వంతో గుర్తిస్తారు. ఇంకొందరిని వారు కొనసాగించే సంప్రదాయాలు, సేవలతో గుర్తిస్తారు. బ్రహ్మంగారి మఠానికే చెందిన నొస్సం వీరభద్రస్వామి విషయంలో ఈ మూడు అంశాలు కలగలిసి కనిపిస్తాయని ఆయన అభిమానులు భక్తులు శిష్యబృందం చెబుతుంటారు. ముఖ్యంగా దివంగత పీఠాధిపతి శ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వరస్వామివారి రూపం, ఆహార్యం, వేషధారణలో వీరభద్రస్వామిని చూసినప్పుడు తండ్రిని గుర్తుకు తెచ్చుకుంటామని పలువురు భక్తులు అభిప్రాయపడుతున్నారు. కేవలం రూపసామ్యం మాత్రమే కాదు.. బ్రహ్మంగారి తత్వాలపై ఆసక్తి, వాటిని ఆలపించే విధానం, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనే తీరు కూడా తండ్రి నుంచి అబ్బిన లక్షణాలుగా వారు పేర్కొంటున్నారు. తండ్రి జీవించి ఉన్న కాలంలోనే ఆయన వద్ద ఆధ్యాత్మిక విషయాలు నేర్చుకోవడం వీరభద్రస్వామి జీవితంలో ముఖ్యమైన అంశం. సాధారణంగా కుటుంబాల్లో పిల్లలకు తల్లిదండ్రుల నుంచి ఆస్తిపాస్తులు, ఆచారవ్యవహారాలు వారసత్వంగా వస్తుంటాయి. కానీ ఆధ్యాత్మిక కుటుంబాల్లో గురువు నుంచి శిష్యుడికి అందే జ్ఞానం మరింత విలువైనది. ఇక్కడ కూడా వీరభద్రస్వామి తన తండ్రిని కేవలం తండ్రిగానే కాకుండా గురువుగా భావిస్తూ బ్రహ్మంగారి తత్వబోధనలు నేర్చుకున్నారని ఆయన సన్నిహితులు భక్తులు చెప్పుకుంటున్న మాట. తండ్రి మరణించిన తర్వాత కూడా ఆ తత్వాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే తన ఆధ్యాత్మిక ప్రయాణంలో ప్రధాన భాగంగా కొనసాగిస్తున్నారన్నది ఆయన వర్గం అభిప్రాయం.

తండ్రికి తగ్గ తనయుడు వీరభద్రస్వామి!

మళ్లీ పుట్టిన శ్రీశ్రీశ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వర స్వామి

వేషధారణలోనే కాదు.. ఆహార్యంలోనూ తండ్రి రూపం!

బ్రహ్మంగారి తత్వాల ఆలాపనలో ప్రత్యేక గుర్తింపు..

కాలజ్ఞాన బోధనల ప్రచారమే జీవిత లక్ష్యం!

• ఎనిమిది మంది సంతానంలో రెండో కుమారుడు!

శ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వరస్వామివారు, చంద్రావతమ్మ దంపతులకు జన్మించిన ఎనిమిది మంది సంతానంలో వీరభద్రస్వామి రెండో కుమారుడు. 1973 మే 20న జన్మించిన ఆయన చిన్నతనం నుంచే మఠ వాతావరణంలో పెరిగారు. ఇంట్లో ఆధ్యాత్మిక చర్చలు, బ్రహ్మంగారి తత్వాల పఠనం, కాలజ్ఞాన ప్రస్తావనలు నిత్యజీవితంలో భాగంగా ఉండేవి. తండ్రి పీఠాధిపతిగా ఉండటంతో చిన్నప్పటి నుంచే మఠ సంప్రదాయాలను దగ్గరగా చూసే అవకాశం ఆయనకు లభించింది. ఇతర పిల్లల మాదిరిగా కేవలం చదువులు, ఆటపాటలకే పరిమితం కాకుండా చిన్న వయసులోనే బ్రహ్మంగారి తత్వాలపై ఆసక్తి పెంచుకున్నారు. తండ్రి వద్ద తత్వాలను నేర్చుకోవడం, వాటిని స్వయంగా ఆలపించడం అలవాటు చేసుకున్నారు. మరోవైపు తన పెద్ద బాబాయి వద్ద తబలా, సంగీతానికి సంబంధించిన ప్రాథమిక విషయాలు అభ్యసించారు. ఈ రెండు అనుభవాలు ఆయనలో ఆధ్యాత్మిక సంగీతాభిరుచిని పెంపొందించాయి. తత్వాలను చదవడం ఒకఎత్తైతే, వాటి భావాన్ని అర్థం చేసుకుని రాగయుక్తంగా ఆలపించడం మరో ప్రత్యేకత. ఈ రెండింటినీ కలిపి కొనసాగించడం ఆయనకు చిన్నతనం నుంచే అలవడిందని సన్నిహితులు చెబుతుంటారు. బ్రహ్మంగారి తత్వాలు కేవలం భక్తి గీతాలు మాత్రమే కావు. వాటిలో భూత భవిష్యత్ వర్తమాన కాలాల జీవన విధానం, మానవత్వం, ధర్మం, ఆధ్యాత్మిక చింతన, సమాజానికి సంబంధించిన అనేక సందేశాలు ఉంటాయి. వాటి భావాన్ని అర్థం చేసుకుని ప్రజలకు వివరించడం కూడా ఒక బాధ్యత. వీరభద్రస్వామి ఆ బాధ్యతను తన తండ్రి నుంచి నేర్చుకున్నారని ఆయన అనుచరులు శిష్యులు పేర్కొంటున్నారు. అందుకే ఆయన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడు తత్వాల ఆలాపనకు ప్రత్యేక స్థానం ఉంటుందని చెబుతున్నారు.

• ఉన్నత విద్య.. ఆధ్యాత్మికతకు మరో కోణం!

ఆధ్యాత్మిక కుటుంబంలో పెరిగినప్పటికీ విద్యకు కూడా వీరభద్రస్వామి ప్రాధాన్యం ఇచ్చారు. అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఏ. పొలిటికల్ సైన్స్‌లో పట్టా పొందారు. సంప్రదాయ ఆధ్యాత్మిక వాతావరణంతో పాటు ఆధునిక విద్యను అభ్యసించడం ఆయన వ్యక్తిత్వంలో మరో కోణంగా చెప్పుకోవచ్చు. రాజకీయ శాస్త్రం చదవడం ద్వారా సమాజ వ్యవస్థలు, పరిపాలన, ప్రజాజీవనం వంటి అంశాలపై విద్యాపరమైన అవగాహన పెంపొందించుకునే అవకాశం ఉంటుంది. మరోవైపు బ్రహ్మంగారి తత్వబోధనలు మనిషి జీవన విధానం, సామాజిక బాధ్యత, నైతిక విలువలను గుర్తుచేస్తాయి. ఈ రెండు విభిన్న రంగాల మధ్య సమన్వయం సాధించడం ఆయన జీవితంలో ఆసక్తికరమైన అంశం. విద్యను అభ్యసించినంత మాత్రాన ఆధ్యాత్మికతకు దూరం కావాల్సిన అవసరం లేదని, అలాగే ఆధ్యాత్మికతను అనుసరించేవారు ఆధునిక విద్యను విస్మరించాల్సిన అవసరం లేదని ఆయన ప్రయాణం సూచిస్తుందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. మఠ సంప్రదాయాలపై అవగాహనతో పాటు విద్యాపరమైన నేపథ్యం కూడా ఉండటం ఆయనకు ప్రత్యేక గుర్తింపునిస్తోందని వారు పేర్కొంటున్నారు.

• తండ్రి వద్ద శిష్యరికం.. తల్లికి కిడ్నీ దానం.. కుటుంబ అనుబంధానికి గుర్తు!

వీరభద్రస్వామి జీవితంలో కుటుంబ అనుబంధాన్ని చాటిచెప్పే మరో ముఖ్యమైన అంశం తల్లికి చేసిన కిడ్నీ దానం. చంద్రావతమ్మ కిడ్నీ సంబంధిత అనారోగ్యంతో బాధపడిన సమయంలో కిడ్నీ మార్పిడి అవసరమైందని, ఆ సమయంలో వీరభద్రస్వామి తన కిడ్నీని దానం చేశారని కుటుంబ వర్గాలు, ఆయన అభిమానులు చెబుతారు. చిన్న వయసులోనే తల్లికి అవయవదానం చేయడం ఆయన జీవితంలో భావోద్వేగపూరితమైన ఘట్టంగా వారు గుర్తుచేసుకుంటారు. తల్లిదండ్రుల పట్ల ప్రేమను మాటల్లో చెప్పడం సులభం. కానీ అవసరమైన సమయంలో వారి కోసం త్యాగానికి సిద్ధపడటం గొప్ప విషయం. వీరభద్రస్వామి విషయంలో ఈ ఘటనను ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులు ప్రత్యేకంగా ప్రస్తావిస్తుంటారు. తల్లితో ఆయనకు ఉన్న అనుబంధానికి ఇది నిదర్శనంగా పేర్కొంటారు. అయితే ఈ వైద్యపరమైన ఘటనను న్యాయపరమైన అర్హతకు లేదా మఠాధిపత్య హక్కుకు ఆధారంగా చూడకూడదు. ఇది ఆయన వ్యక్తిగత జీవితానికి, కుటుంబ అనుబంధానికి సంబంధించిన అంశం మాత్రమే. వీరభద్రస్వామి తన తండ్రి శ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వరస్వామివారి వద్ద మంత్రోపదేశం పొందారని ఆయన జీవిత విశేషాల్లో పేర్కొంటారు. గృహస్థ ధర్మాన్ని అనుసరిస్తూనే ఆధ్యాత్మిక సేవలను కొనసాగించడం ఆయన ప్రత్యేకతగా అభిమానులు వివరిస్తున్నారు. తండ్రి వద్ద నేర్చుకున్న బ్రహ్మంగారి తత్వాలను కేవలం వ్యక్తిగత సాధనకే పరిమితం చేయకుండా వివిధ ప్రాంతాల్లో ప్రచారం చేయాలన్న సంకల్పంతో ముందుకు సాగారని చెబుతున్నారు. ఇక్కడ ఒక విషయం ప్రత్యేకంగా గమనించాలి. ఒక మఠానికి సంబంధించిన వారసత్వం అంటే కేవలం కుటుంబంలో పుట్టిన హక్కు మాత్రమే కాదు. ఆ మఠం అనుసరించే సంప్రదాయాలను తెలుసుకోవడం, ఆధ్యాత్మిక విషయాల్లో పట్టు సాధించడం, శిష్యులకు బోధించే సామర్థ్యం కలిగి ఉండటం కూడా ముఖ్యమైన అంశాలు. వీరభద్రస్వామి తనకు తండ్రి నుంచి అలాంటి శిక్షణ, మార్గదర్శకత్వం లభించాయని చెబుతున్నారు. తన జీవితంలో బ్రహ్మంగారి తత్వప్రచారానికి ప్రాధాన్యం ఇవ్వడం కూడా ఆ గురూపదేశాన్ని కొనసాగించడంలో భాగమని ఆయన వర్గం భావిస్తోంది.

• రాష్ట్రాలు దాటి బ్రహ్మంగారి తత్వప్రచారం!

ఒక ప్రాంతానికి చెందిన ఆధ్యాత్మిక సంప్రదాయం మరో ప్రాంతానికి చేరాలంటే నిరంతర ప్రచారం అవసరం. భాష, ప్రాంతం, సామాజిక పరిస్థితులు మారినా ఆధ్యాత్మిక సందేశం ప్రజలకు చేరేలా కార్యక్రమాలు నిర్వహించాలి. ఈ దిశగా వీరభద్రస్వామి ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా తదితర రాష్ట్రాల్లో బ్రహ్మంగారి ఆధ్యాత్మిక ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని ఆయన అనుచరులు చెబుతున్నారు. వీరబ్రహ్మేంద్రస్వామివారి తత్వాలు, కాలజ్ఞాన సందేశాలను ప్రజలకు వివరించడం, భక్తి కార్యక్రమాల్లో పాల్గొనడం, తత్వాల ఆలాపన ద్వారా ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడం ఆయన సేవల్లో ముఖ్యమైనవిగా పేర్కొంటున్నారు. వివిధ ప్రాంతాల్లో భక్తుల ఆహ్వానం మేరకు కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఆయనకు ప్రత్యేక భక్తవర్గం ఏర్పడిందని చెబుతున్నారు. స్వామివారి ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు, శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామివారి జయంతి ఉత్సవాలు, విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలు, ఆధ్యాత్మిక హారతి కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటున్నట్లు అందించిన జీవిత విశేషాలు తెలియజేస్తున్నాయి. ఆలయాల్లో శంకుస్థాపన పూజలు, ప్రాణప్రతిష్ఠలు, కుంభాభిషేకాలు, విగ్రహ ఆవిష్కరణలు, హోమాలు, అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని ఆయన వర్గం పేర్కొంటోంది. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా ఒక ఆధ్యాత్మిక సంప్రదాయాన్ని ప్రజల్లో నిలబెట్టే ప్రయత్నం జరుగుతుంది. ముఖ్యంగా బ్రహ్మంగారి తత్వాలు కొత్త తరాలకు చేరాలంటే పుస్తకాలు, ప్రవచనాలతో పాటు ప్రత్యక్ష కార్యక్రమాలు కూడా అవసరం. ఆ దిశగా వీరభద్రస్వామి చేస్తున్న ప్రచారాన్ని ఆయన అభిమానులు ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నారు.

• ఆలయ సేవల నుంచి సామాజిక సేవ వరకు!

ఆధ్యాత్మికత అంటే కేవలం పూజలు, హోమాలు, అభిషేకాలు మాత్రమే కాదు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు సహాయం చేయడం, పిల్లలకు సంప్రదాయ ధార్మిక సంస్కారాలను పరిచయం చేయడం కూడా ఆధ్యాత్మిక సేవలో భాగమే. ఈ భావనతో బ్రహ్మంగారి మఠానికి వచ్చే భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వీరభద్రస్వామి అనుచరులు చెబుతున్నారు. అలాగే విశ్వజ్ఞానహరణ బాలలకు సామూహిక ఉచిత ఉపనయన కార్యక్రమాలు నిర్వహించడం కూడా ఆయన ఆధ్యాత్మిక సేవల్లో ఒకటిగా పేర్కొంటున్నారు. సంప్రదాయ ధార్మిక కార్యక్రమాలను ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా అందరికీ అందుబాటులోకి తీసుకురావాలన్న ప్రయత్నంగా ఈ కార్యక్రమాలను ఆయన వర్గం వివరిస్తోంది. ఆధ్యాత్మిక సంస్థలపై ప్రజలకు ఉండే విశ్వాసం వాటి కార్యక్రమాల వల్ల మరింత బలపడుతుంది. ఒకవైపు తత్వబోధనలు, మరోవైపు భక్తి కార్యక్రమాలు, ఇంకోవైపు అన్నదానం వంటి సేవలు.. ఇవన్నీ కలిసినప్పుడే ఆధ్యాత్మిక సంస్థలు సమాజంతో నిరంతర సంబంధాన్ని కొనసాగించగలుగుతాయి. ఈ నేపథ్యంలో వీరభద్రస్వామి చేపడుతున్న కార్యక్రమాలను ఆయన అనుచరులు సేవా ప్రయాణంలో భాగంగా చూస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో వీరభద్రస్వామి భక్తుల నుంచి సత్కారాలు, సన్మానాలు పొందినట్లు ఆయన జీవిత విశేషాల్లో పేర్కొన్నారు. చతురస్ర రథారోహణ, రజత కిరీటధారణ వంటి గౌరవాలతో సత్కరించబడ్డారని ఆయన వర్గం తెలియజేస్తోంది. ఈ గౌరవాలు ఆయనకు లభించిన భక్తుల ఆదరణకు గుర్తులుగా వారు భావిస్తున్నారు. అయితే ఒక వ్యక్తి ఆధ్యాత్మికంగా ఎంత ఉన్నత స్థాయిలో ఉన్నారన్నది సన్మానాల సంఖ్యతో మాత్రమే నిర్ణయించలేం. ఆయన బోధనలు, ఆచరణ, సేవలు, సంప్రదాయాలపై అవగాహన, శిష్యులకు మార్గదర్శనం చేసే సామర్థ్యం వంటి అంశాలు కూడా ముఖ్యమైనవి. ఈ నేపథ్యంలో వీరభద్రస్వామి తన తండ్రి నుంచి నేర్చుకున్న తత్వాలను ఎంత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు? వాటిని భవిష్యత్తు తరాలకు ఎలా అందించగలుగుతారు? అన్నది ఆయన ఆధ్యాత్మిక ప్రయాణంలో కీలకమైన అంశాలుగా నిలుస్తాయి.

• పీఠాధిపత్య వివాదంలో వీరభద్రస్వామి వాదన!

ఇంతవరకు వీరభద్రస్వామి వ్యక్తిగత జీవితం, విద్య, ఆధ్యాత్మిక సేవలు ఒక కోణమైతే.. బ్రహ్మంగారి మఠం పీఠాధిపత్య వివాదంలో ఆయన పాత్ర మరో కోణం. దివంగత పీఠాధిపతి శ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వరస్వామివారి మరణం తర్వాత వారసత్వ అంశం వివాదంగా మారింది. కుటుంబంలో పలువురు తమ వాదనలను వినిపించారు. వీరభద్రస్వామి కూడా తన తండ్రి తనను వారసుడిగా ఎంపిక చేసినట్లు పేర్కొంటూ 2018 నవంబర్ 10న రాసిన వీలునామాను ప్రస్తావించారు. తన తండ్రి ద్వారా ధార్మిక పరిషత్‌కు ఆ విషయాన్ని తెలియజేసినట్లు న్యాయస్థానంలో వాదించారు. తాజాగా ఈ వివాదంలో హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన పేరు మరోసారి ప్రముఖంగా వినిపిస్తోంది. 2026 జనవరి 13న తన సోదరుడు నొస్సం వెంకటాద్రిస్వామిని తాత్కాలిక మఠాధిపతిగా నియమిస్తూ ధార్మిక పరిషత్ ఇచ్చిన ఉత్తర్వులను నవంబర్ 4న హైకోర్టు రద్దు చేసింది. నియామక ప్రక్రియలో మఠాల పరిపాలన నిబంధనలను పాటించలేదన్న అంశాన్ని ప్రధానంగా పరిగణించింది. ముఖ్యంగా మఠ శిష్యులకు, అదే సంప్రదాయానికి చెందిన ఇతర మఠాల పీఠాధిపతులకు తగిన ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఎంపిక ప్రక్రియ చేపట్టడంపై న్యాయస్థానం అభ్యంతరం వ్యక్తం చేసింది. అభ్యర్థుల ఆధ్యాత్మిక అర్హతలను కూడా చట్టప్రకారం పరిశీలించాల్సిన అవసరాన్ని స్పష్టం చేసింది. పెద్ద కుమారుడనే కారణం ఒక్కటే మఠాధిపతి పదవికి సరిపోదని పేర్కొంది. ఈ పరిణామం వీరభద్రస్వామి వాదనకు ప్రాధాన్యం పెంచింది. ఎందుకంటే ఆయన తన తండ్రి వద్ద పొందిన ఆధ్యాత్మిక శిక్షణ, బ్రహ్మంగారి తత్వాలపై అవగాహన, తత్వాల ప్రచారంలో తన అనుభవాన్ని ప్రస్తావిస్తున్నారు. అయితే హైకోర్టు ఆయనను మఠాధిపతిగా ప్రకటించలేదు. ఆయనకు పీఠాధిపత్యం ఖరారైందని కూడా తీర్పు చెప్పలేదు. కొత్త నియామక ప్రక్రియలో ఆయనతో పాటు ఇతర అర్హుల వాదనలను పరిశీలించాల్సి ఉంటుంది. ఈ విషయంలో చట్టపరమైన అంశాలను, వ్యక్తిగత ఆధ్యాత్మిక అనుభవాలను వేర్వేరుగా చూడాలి. తండ్రి రాసినట్లు చెబుతున్న వీలునామా చెల్లుబాటు, వారసత్వ హక్కు వంటి అంశాలు సంబంధిత న్యాయస్థానాల్లో తేలాల్సి ఉంటుంది. అదే సమయంలో మఠాధిపతి నియామకానికి అవసరమైన ఆధ్యాత్మిక అర్హతలను దేవాదాయ శాఖ కమిషనర్ పరిశీలించాల్సి ఉంటుంది. ఈ రెండు ప్రక్రియల మధ్య తేడాను గుర్తించడం అవసరం.

• అసలు పరీక్ష.. వారసత్వం కంటే బాధ్యతే ప్రధానమా?

బ్రహ్మంగారి మఠం పీఠాధిపత్యం అంటే కేవలం ఒక పదవిని చేపట్టడం కాదు.. శతాబ్దాల ఆధ్యాత్మిక చరిత్రను, సంప్రదాయాలను పరిరక్షిస్తూ భవిష్యత్తు తరాలకు అందించే గురుతర బాధ్యతను స్వీకరించడం. కాలజ్ఞాన సందేశాల ప్రచారం, మఠ శిష్యులకు మార్గదర్శనం, భక్తుల విశ్వాస పరిరక్షణ, ఆచార వ్యవహారాల కొనసాగింపు.. ఇలా ఎన్నో అంశాలతో ముడిపడిన ఈ బాధ్యత ఇప్పుడు మరోసారి చర్చనీయాంశంగా మారింది. దివంగత పీఠాధిపతి వీరభోగ వసంత వెంకటేశ్వరస్వామివారి వద్ద చిన్ననాటి నుంచే బ్రహ్మంగారి తత్వబోధనలు నేర్చుకున్న వీరభద్రస్వామి, సంగీతంపై ఆసక్తితో వాటిని ఆలపించడం మొదలుపెట్టి, ఉన్నత విద్యను అభ్యసిస్తూనే ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో ఆధ్యాత్మిక ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. తండ్రి నుంచి అందుకున్న గురూపదేశం, మఠ సంప్రదాయాలపై అవగాహన, తత్వాల ప్రచారంలో అనుభవం తనకు ప్రత్యేక గుర్తింపునిస్తాయని ఆయన వర్గం భావిస్తోంది. అయితే వ్యక్తిగత అభిమానాలు, కుటుంబ వారసత్వం మాత్రమే పీఠాధిపత్యానికి ప్రాతిపదిక కాలేవు. హైకోర్టు తాజా ఉత్తర్వులతో తాత్కాలిక మఠాధిపతి నియామకం రద్దు కావడంతో కొత్త నియామక ప్రక్రియకు మార్గం ఏర్పడింది. కోర్టు ఆదేశాల మేరకు దేవాదాయ శాఖ కమిషనర్ అభ్యర్థుల ఆధ్యాత్మిక అర్హతలు, సంప్రదాయ పరిజ్ఞానం, శిష్యులకు మార్గదర్శనం చేసే సామర్థ్యాన్ని పరిశీలించాలి. మఠ శిష్యులతో పాటు అదే సంప్రదాయానికి చెందిన ఇతర మఠాల పీఠాధిపతులకు కూడా నిబంధనల ప్రకారం అవకాశం కల్పించి, ఉత్తర్వుల ప్రతిని అందుకున్న తర్వాత ప్రాధాన్యంగా మూడు నెలల్లో ప్రక్రియను పూర్తి చేయాలని హైకోర్టు సూచించింది. మరోవైపు తన తండ్రి 2018 నవంబర్ 10న రాసినట్లు పేర్కొంటున్న వీలునామా ద్వారా వారసత్వ హక్కును కోరుతున్న వీరభద్రస్వామి వాదన కూడా న్యాయపరమైన పరిశీలనకు లోబడి ఉంటుంది. అయితే హైకోర్టు ఆయనను పీఠాధిపతిగా ప్రకటించలేదు. ఇప్పుడు ఆయన తన ఆధ్యాత్మిక అనుభవాన్ని, తత్వప్రచార సేవలను, మఠ సంప్రదాయాలపై అవగాహనను అధికారుల ముందు ఎలా నిరూపించుకుంటారన్నదే కీలకం. ఒకవైపు వారసత్వ హక్కులపై న్యాయపోరాటం.. మరోవైపు ఆధ్యాత్మిక అర్హతల పరిశీలన.. ఇంకోవైపు భక్తులు, శిష్యుల అభిప్రాయాలు.. ఈ మూడు అంశాల మధ్య బ్రహ్మంగారి మఠం భవిష్యత్తు నిర్ణయం కానుంది. తండ్రి రూపాన్ని పోలి ఉండటం కంటే ఆయన ఆధ్యాత్మిక విలువలను ఆచరణలో కొనసాగించడం ముఖ్యమనే అభిప్రాయాల మధ్య వీరభద్రస్వామి ప్రయాణంలో ఇప్పుడు అసలైన పరీక్ష మొదలైంది.

వీరభద్రస్వామి

నెహ్రూ–గాంధీ కుటుంబానికి చెందిన సోనియా గాంధీ తన జీవితంలోని కీలక సంఘటనల ను తొలిసారిగా తన కోణంలో ప్రజల ముందుకు తీసుకొచ్చారు. 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పేరుతో వెలువడిన ఆమె జ్ఞాపకాల పుస్తకం జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. హార్పర్‌కాలిన్స్ ఇండియా ప్రచురించిన ఈ పుస్తకం నవంబర్ 10న విడుదలైంది. ఇప్పటివరకు తన గురించి అనేక మంది పుస్తకాలు రాశారని, తన జీవితాన్ని ఇతరుల కోణంలో వివరించారని పేర్కొన్న సోనియా.. ఇప్పుడు తన కథను తానే చెప్పుకోవాల్సిన సమయం వచ్చిందని వెల్లడించారు. ఈ పుస్తక రచన దాదాపు దశాబ్దం క్రితమే ప్రారంభమైంది. అయితే ఐదేళ్ల క్రితం నుంచి పూర్తిస్థాయిలో రచనపై దృష్టి పెట్టారు. రాజకీయాలు నేపథ్యంగా ఉన్నప్పటికీ, అసలు కథ ప్రేమ, కుటుంబ అనుబంధాలు, భారతదేశంతో తనకు ఏర్పడిన అనుబంధం చుట్టూ తిరుగుతుందని వివరించారు. ఇటలీలోని చిన్న పట్టణంలో పెరిగిన యువతి కేం బ్రిడ్జ్‌లో రాజీవ్ గాంధీని కలవడం, ప్రేమలో పడటం, వివాహం తర్వాత భారత్‌కు రావడం, ఇందిరా గాంధీ కుటుంబంలో సభ్యురాలిగా మారడం, చివరకు దేశ రాజకీయాల్లో కీలక నాయకురాలిగా ఎదగడం వరకు తన జీవిత ప్రయాణంలోని మలుపులను గుర్తుచేసుకున్నారు. రాజీవ్‌తో ప్రేమ, ఇందిరా గాంధీతో అనుబంధం, కుటుంబ బాధ్యతలు, భారతదేశంపై పెరిగిన అభిమానం తన జీవితాన్ని మలిచాయని చెప్పారు. భారత్‌కు వచ్చినప్పుడు దేశం గురించి తనకు పెద్దగా తెలియదని, రాజీవ్, ఇందిరా గాంధీల నుంచి ధైర్యం, మానవత్వం, లౌకికవాదం, ప్రజాస్వామ్య విలువలను నేర్చుకున్నానని పేర్కొన్నారు. కుటుంబం, స్నేహితుల పట్ల విధేయత, ఇతరుల పట్ల సానుభూతి, బాధ్యతాయుతంగా వ్యవహరించడం వంటి చిన్ననాటి విలువలు ఇప్పటికీ తనలో ఉన్నాయని వివరించారు. తొలుత రాజకీయాల్లోకి రావాలనే ఆసక్తి తనకు లేదని, అయితే కుటుంబం చేసిన త్యాగాల లక్ష్యం ప్రమాదంలో పడటం, కాంగ్రెస్ పార్టీ బలహీనపడటంతో ఏదో ఒకటి చేయాల్సిన బాధ్యత తనపై ఉందని భావించినట్లు వెల్లడించారు. అందుకే ఈ పుస్తకం కేవలం రాజకీయ విజయాల చరిత్ర కాదు.. వ్యక్తిగత జీవితంలోని ప్రేమ, విషాదం, కుటుంబ అనుబంధాలు, బాధ్యతలు, రాజకీయ నిర్ణయాల వెనుక ఉన్న మానసిక సంఘర్షణలను ఆవిష్కరించే జీవిత ప్రయాణం.



వీడిన మౌనం

ఇన్నాళ్లూ సైలెంట్.. ఇప్పుడు సెన్సేషన్

- రాజకీయాల్లో సోనియా సంచలనం
- ఆత్మకథతో ప్రత్యర్థుల్లో అంతర్మథనం
- ప్రేమ ప్రయాణం.. కుటుంబ కలహం..
- గుజరాత్ గాయం.. రాజకీయ రణం!

గుజరాత్ గాయాలు.. గుండెల్ని గడ్డకట్టించిన గాంధీ జ్ఞాపకాల ఘోర గాథ

సోనియా గాంధీ ఆత్మకథలో అత్యంత హృదయవిదారకమైన ఘట్టాల్లో 2002 గుజరాత్ అల్లర్ల ప్రస్తావన ఒకటి. అప్పట్లో లోక్‌సభ ప్రతిపక్ష నేతగా ఉన్న ఆమె, రాష్ట్రంలో చెలరేగిన మత ఘర్షణలు, బాధితుల దుస్థితి, ప్రభుత్వ స్పందనపై తన అనుభవాలను వివరించారు. గోద్రాలో సబర్మతి ఎక్స్‌ప్రెస్‌కు చెందిన నాలుగు బోగీలకు నిప్పంటించిన ఘటన తర్వాత గుజరాత్ అంతటా హింస వ్యాపించింది. అయోధ్య నుంచి అహ్మదాబాద్‌కు తిరిగి వస్తున్న రైలులో కరసేవకులు ప్రయాణిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. రైలు దహనంలో 58 మంది ప్రాణాలు కోల్పోయినట్లు వార్తలు వెలువడ్డాయి. అనంతరం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మత ఘర్షణలు చెలరేగాయి. ఈ ఘటనకు దారితీసిన అగ్నిప్రమాద కారణాలపై ఇప్పటికీ వివాదాలు కొనసాగుతున్నాయని సోనియా గుర్తుచేశారు. టెలివిజన్‌లో ప్రసారమైన హింసాత్మక దృశ్యాలను చూసి తాము దిగ్భ్రాంతికి గురయ్యామని, గుజరాత్ కాంగ్రెస్ నాయకులు సహాయం కోసం ఫోన్ చేసినప్పటికీ రాష్ట్ర యంత్రాంగం స్పందించ లేదని ఆరోపించారు. అనంతరం అఖిలపక్ష పార్లమెంటరీ ప్రతినిధి బృందంలో భాగంగా అహ్మదాబాద్‌ను సందర్శించారు. తొలుత రాష్ట్ర అధికారులతో జరిగిన సమావేశంలో ప్రభుత్వం అందించిన నివేదికలో బాధితుల కష్టాల పట్ల కనీస మానవీయ స్పందన కనిపించలేదని ఆమె అభిప్రాయపడ్డారు. ఆ తర్వాత భద్రత పేరుతో తమను బస్సులో ఎక్కించి బాధితులు ఆశ్రయం పొందుతున్న సహాయ శిబిరాలకు తీసుకెళ్లారని వివరించారు. అక్కడ ఎదురైన ఒక సంఘటన తన జీవితంలో ఎప్పటికీ మరిచిపోలేనిదని పేర్కొన్నారు. హింసకు గురైన కుటుంబాలతో నిండిన ఆ శిబిరంలో పురుషులు, మహిళలు, చిన్నారులు తీవ్ర భయాందోళనలతో, మానసిక వేదనతో కనిపించారని తెలిపారు. అక్కడ ఓ తండ్రి బలహీనంగా ఉన్న తన కుమార్తెను ప్రతినిధుల ముందు నిలబెట్టి ఆమెపై జరిగిన దారుణాన్ని వివరించాడు. తన బిడ్డపై పడేపడే అత్యాచారం జరిగిందని, ఆమె పరిస్థితిని ఒక్కసారి జాగ్రత్తగా చూడాలని వేడుకున్నాడు. 'నేను ఏం చేయాలి? ఏదైనా చేయండి' అంటూ కన్నీళ్లతో మొరపెట్టుకున్నాడని సోనియా గుర్తుచేశారు. ఆ దృశ్యం చూసి ప్రతినిధి బృందం మొత్తం చలించిపోయిందని, తనకు మాటలు రాక కొన్ని ఓదార్పు మాటలు మాత్రమే చెప్పగలిగానని వెల్లడించారు. బాధిత తండ్రి ఆవేదన, అమాయక బాలిక ఎదుర్కొన్న దారుణం తనను తీవ్రంగా కలచివేశాయని రాశారు. అప్పటి ముఖ్యమంత్రి నరేంద్ర మోదీని ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి పదవి నుంచి తొలగిస్తారని విస్తృతంగా ప్రచారం జరిగినప్పటికీ, సొంత పార్టీ నుంచి వచ్చిన ఒత్తిళ్ల కారణంగా ఆ నిర్ణయం అమలుకాలేదని సోనియా పేర్కొన్నారు. ఈ జ్ఞాపకాల ద్వారా గుజరాత్ అల్లర్ల సమయంలో ప్రభుత్వ బాధ్యత, బాధితులకు న్యాయం, రాజకీయ నాయకత్వం స్పందన వంటి కీలక అంశాలను ఆమె మరోసారి చర్చలోకి తీసుకొచ్చారు.

మోదీతో మాటలు మౌనం.. సిద్ధాంతాల సమరం.. సోనియా సంచలన స్వరం

ప్రధాని నరేంద్ర మోదీపై సోనియా గాంధీ చేసిన వ్యాఖ్యలు ఆమె ఆత్మకథలో కీలక రాజకీయ అంశంగా మారాయి. మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి పన్నెండేళ్లకు పైగా గడిచినా, ఆయనతో తనకు పెద్దగా వ్యక్తిగత పరిచయం లేదని సోనియా వెల్లడించారు. పార్లమెంటు సమావేశాలు ముగిసిన తర్వాత స్పీకర్ ఛాంబర్‌లో వివిధ పార్టీల నాయకులు కలుసుకునే సందర్భాల్లో మాత్రమే ఇద్దరూ ఎదురుపడతారని, అప్పుడు సాధారణ నమస్కారంతోనే సరిపెడతామని వివరించారు. గతంలో రాజకీయ ప్రత్యర్థుల మధ్య కూడా పరస్పర గౌరవం, మర్యాద, స్నేహపూర్వక సంబంధాలు ఉండేవని, ప్రస్తుతం అలాంటి పరిస్థితి కనిపించడం లేదని అభిప్రాయపడ్డారు. మోదీ ఎదురుపడినప్పుడు కళ్లలోకి చూడకుండా చూపు పక్కకు తిప్పుకుంటారని కూడా తన పుస్తకంలో పేర్కొన్నారు. ఆసుపత్రిలో చికిత్స అనంతరం తిరిగి వచ్చినప్పుడు మాత్రం ఆయన ఆరోగ్యం గురించి అడిగేవారని, 'బాగున్నారా?' అని ప్రశ్నిస్తే తాను బాగున్నానని కృతజ్ఞతలు చెప్పేదాన్ని గుర్తుచేశారు. పుట్టినరోజు, నూతన సంవత్సర శుభాకాంక్షల వంటి అధికారిక సందేశాలకే తమ సంభాషణలు పరిమితమయ్యాయని తెలిపారు. అయితే మోదీతో తనకు ఉన్న విభేదాలు వ్యక్తిగతమైనవి కావని, పూర్తిగా సిద్ధాంతపరమైనవని స్పష్టం చేశారు. ఇద్దరివీ భిన్నమైన రాజకీయ నేపథ్యాలని, దేశం ఎలా ఉండాలనే విషయంలోనూ తమ ఆలోచనలు వేరని పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ భావజాలం నుంచి కాంగ్రెస్ నేర్చుకోవాల్సిందేమీ లేదని వ్యాఖ్యానించారు. మోదీ రాజకీయ నేపథ్యాన్ని ప్రస్తావిస్తూ ఆయన ఆర్ఎస్ఎస్‌లో క్షేత్రస్థాయి నుంచి ఎదిగారని అంగీకరించినప్పటికీ, కాంగ్రెస్‌లోనూ డాక్టర్ మన్మోహన్ సింగ్, మల్లికార్జున ఖర్గే వంటి నాయకులు తమ సామర్థ్యంతో ఉన్నత స్థాయికి చేరుకున్నారని గుర్తుచేశారు. బీజేపీ-ఆర్ఎస్ఎస్ పాలనలో ప్రజాస్వామ్య వ్యవస్థలు, రాజ్యాంగ విలువలు, సామాజిక ఐక్యత తీవ్రంగా దెబ్బతిన్నాయని విమర్శించారు. గత పన్నెండేళ్లలో వ్యవస్థలకు జరిగిన నష్టాన్ని సరిచేయడానికి ప్రభుత్వం మారిన తర్వాత కూడా చాలా సమయం, రాజకీయ పార్టీల సమిష్టి కృషి అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, పరిస్థితులను వారు క్రమంగా గుర్తిస్తున్నారని, భవిష్యత్తులో సరైన పాలన తిరిగి వస్తుందనే నమ్మకం తనకు ఉందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ లౌకికవాదం విషయంలో ఎప్పుడూ స్పష్టంగా వ్యవహరించిందా? అన్న ప్రశ్నకు స్పందిస్తూ, పార్టీలో కొందరికి భిన్నమైన అభిప్రాయాలు ఉన్నప్పటికీ, రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛకు మద్దతు ఇవ్వడమే కాంగ్రెస్ అధికారిక వైఖరి అని స్పష్టం చేశారు.

మేనకాతో మనస్పర్థలు.. గాంధీ కుటుంబంలో కలహాలు.. సోనియా కీలక వ్యాఖ్యలు

సోనియా గాంధీ ఆత్మకథలో గాంధీ కుటుంబ అంతర్గత వ్యవహారాలు ప్రత్యేక ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ముఖ్యంగా సంజయ్ గాంధీ భార్య మేనకా గాంధీతో తనకు ఏర్పడిన విభేదాలను ఆమె విస్తృతంగా వివరించారు. మేనకా కుటుంబంలోకి పచ్చిన తొలినాళ్లలో తమ మధ్య మంచి అనుబంధం ఉండేదని, ఆమె చురుకుదనం, ఉత్సాహంగా మాట్లాడే తీరు తనకు నచ్చేవని గుర్తుచేసుకున్నారు. 1973 చివర్లో సంజయ్‌కు మేనకా పరిచయమయ్యారని, అప్పటికి ఆమె వయసు తక్కువేనని పేర్కొన్నారు. ఏడాది లోపే వివాహం జరగడంతో మేనకా గాంధీ కుటుంబంలో చిన్న కోడలిగా అడుగుపెట్టారు. ఇంట్లో ఆమెను 'చోటీ బహూ' అని, తనను 'బహూరాణి' అని పిలిచే వారని సోనియా వివరించారు. ఇద్దరినీ సమానమైన కోడళ్లుగా భావించినప్పటికీ, మేనకా మాత్రం ఆ పిలుపును తనకు తక్కువ స్థానం ఇచ్చినట్లుగా భావించి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. మొదట్లో మేనకా తన గదికి వచ్చి స్నేహితులు, పుస్తకాల గురించి ఉత్సాహంగా మాట్లాడేదని, ప్రియాంక కూడా ఆమె చెప్పే కథలను ఆసక్తిగా వినేదని గుర్తుచేసుకున్నారు. అయితే క్రమంగా ఇంట్లో విభేదాలు పెరిగి, సంజయ్-మేనకా మధ్య గొడవలు ఎక్కువయ్యాయని తెలిపారు. మేనకా కొన్నిసార్లు పెద్దల సమక్షంలోనూ అభ్యంతరకరమైన పదాలు ఉపయోగించేదని, అది కుటుంబ సభ్యులను ఇబ్బందికి గురిచేసేదని రాశారు. సంజయ్ రాజకీయ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం ప్రారంభించిన తర్వాత ఆయనపై మేనకా ప్రభావం పెరిగిందని, ఫలితంగా రాజీవ్‌తో సంజయ్‌కు ఉన్న అనుబంధం కూడా దెబ్బతిందని పేర్కొన్నారు. 1977 ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి తర్వాత సంజయ్ రాజకీయ వైఖరి మరింత దూకుడుగా మారిందని, ఎమర్జెన్సీ సమయంలో జరిగిన పరిణామాల్లో ఆయన పాత్రపై చర్చ జరిగిందని వివరించారు. మేనకా తన కుమారుడిని రాజకీయంగా ప్రోత్సహిస్తోందని ఇందిరా గాంధీ కూడా భావించినట్లు సోనియా వెల్లడించారు. 1978 ఎన్నికల పరిణామాలపై రాజీవ్, సంజయ్ మధ్య తీవ్ర వాదనలు జరిగాయని, ఇందిరా గాంధీ సైతం సంజయ్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ఇలా తొలుత కుటుంబంలో చిన్నచిన్న మనస్పర్థలుగా ప్రారంభమైన విభేదాలు క్రమంగా రాజకీయం వరకు విస్తరించాయని సోనియా తన జ్ఞాపకాల్లో వివరించారు.

ఎమర్జెన్సీ ఎపిసోడ్.. కాంగ్రెస్ భవిష్యత్తు.. బీజేపీ విమర్శల దాడి

సోనియా గాంధీ తన ఆత్మకథలో కుటుంబ విషయాలతో పాటు కాంగ్రెస్ చరిత్ర, ఎమర్జెన్సీ, రాజకీయ పరిణామాలు, ప్రతిపక్షాల భవిష్యత్తుపై కీలక అంశాలను వెల్లడించారు. 1975-77 ఎమర్జెన్సీని భారత చరిత్రలో చీకటి అధ్యాయంగా అభివర్ణిస్తూ, ప్రజాస్వామ్య హక్కులు హరించబడి, వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగిందని అంగీకరించారు. హింసాత్మక నిరసనలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా రవాణాపై దాడులు ఇందిరా గాంధీపై ఒత్తిడి పెంచాయని, రాజీవ్ కూడా కొన్ని పరిణామాలపై తల్లిని హెచ్చరించేవారని గుర్తుచేశారు. చివరకు ఇందిరా 1977 ఎన్నికలకు వెళ్లి, ఎమర్జెన్సీ అతిక్రమణలపై విచారం వ్యక్తం చేసి క్షమాపణలు చెప్పారని పేర్కొన్నారు. 1999లో శరద్ పవార్, పీఏ సంగ్మా, తారిక్ అన్వర్ తన విదేశీ మూలాలను ప్రశ్నించడంతో బాధపడి కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేశానని, తర్వాత పార్టీ కోసం కొనసాగానని తెలిపారు. 2004లో కాంగ్రెస్ కూటమి గెలిచినా ప్రధాని పదవిని మన్మోహన్ సింగ్‌కు అప్పగించడంపై తనకు పశ్చాత్తాపం లేదన్నారు. రాజకీయ అవసరాలతో ఇతర పార్టీలతో పొత్తులు పెట్టుకున్నా, బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో రాజీపడలేదని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలకు సమాన అవకాశాలు లేవని, రాజ్యాంగ సంస్థలు, మీడియా, ఆర్థిక బలం, మత రాజకీయాలు ఎన్నికలను ప్రభావితం చేస్తున్నాయని ఆరోపించారు. అయినా కాంగ్రెస్ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పోరాడుతున్నారని, భవిష్యత్తుపై ఆశాభావం ఉందన్నారు. పుస్తక ప్రచురణలో తొలుత పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా ఒప్పందం ముందుకు సాగకపోవడంతో హార్పర్‌కాలిన్స్ బాధ్యతలు చేపట్టింది. మోదీ, ఆర్ఎస్ఎస్, మత ఘర్షణలు, చైనా అంశాలే ఇందుకు కారణమని వార్తలు వచ్చినా, వాటిపై మాట్లాడనని సోనియా తెలిపారు. బీజేపీ నేత సీఆర్ కేశవన్ 'బిలాంగింగ్'కు బదులుగా 'వైట్‌వాషింగ్' అని పేరు పెట్టాల్సిందని విమర్శించారు. 1984 సిక్కు వ్యతిరేక హింస, గురుద్వారాలపై దాడులు, బాబ్రీ మసీదు కూల్చివేత, 2008 ముంబై దాడులపై కాంగ్రెస్ వైఖరిని ప్రశ్నించారు. దీంతో పుస్తక విడుదల కాంగ్రెస్-బీజేపీ మధ్య మరోసారి రాజకీయ విమర్శలకు వేదికైంది. తన రాజకీయ కార్యదర్శి అహ్మద్ పటేల్‌ను విశ్వసనీయ సహచరుడిగా గుర్తుచేసిన సోనియా, ఆయన మరణించిన సంవత్సరాన్ని 2022గా పేర్కొనడం పుస్తకంలోని తప్పిదంగా గుర్తించారు.

సంజయ్ మరణం.. మేనకా నిష్క్రమణ.. గాంధీ కుటుంబంలో కల్లోలం

1980 జూన్ 23న విమాన ప్రమాదంలో సంజయ్ గాంధీ మరణించడం గాంధీ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. అయితే ఆయన మరణం తర్వాత మేనకా గాంధీతో ఇందిరా గాంధీ కుటుంబానికి ఉన్న విభేదాలు మరింత ముదిరాయని సోనియా తన ఆత్మకథలో వెల్లడించారు. సంజయ్ మరణించే నాటికి మేనకా వయసు కేవలం 23 ఏళ్లు మాత్రమేనని, అప్పటికే ఆమెకు చిన్న బిడ్డ ఉన్నాడని పేర్కొన్నారు. మేనకాకు వెంటనే రాజకీయ బాధ్యతలు అప్పగించేందుకు ఇందిరా గాంధీ సిద్ధంగా లేరని, కొంతకాలం బిడ్డను చూసుకుంటూ కుటుంబంతో ఉండాలని సూచించినట్లు వివరించారు. అయితే మేనకా మాత్రం రాజకీయంగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకోవాలని భావించారని సోనియా అభిప్రాయపడ్డారు. 1981లో కుమారుడు ఫిరోజ్ వరుణ్ గాంధీ మొదటి పుట్టినరోజు వేడుకను ఇందిరా గాంధీ రాజకీయ ప్రత్యర్థి వసుంధర రాజే ఇంట్లో నిర్వహించడం కూడా కుటుంబంలో అసంతృప్తికి కారణమైందని తెలిపారు. అనంతరం ఇందిరా గాంధీ లండన్‌లో ఉన్న సమయంలో మేనకా ఇంట్లోని తన



వస్తువులను తరలించడం ప్రారంభించారని పేర్కొన్నారు. తిరిగి వచ్చిన ఇందిరా గాంధీ ఈ పరిణామంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసి, కుటుంబంలో ఉండాలంటే సంయమనం పాటించాలని, లేదంటే వేరుగా వెళ్లిపోవాలని మేనకాకు స్పష్టం చేసినట్లు సోనియా రాశారు. దీనికి మేనకా ఆరోపణలతో కూడిన లేఖ రాశారని, ఇంటి నుంచి వెళ్లిపోవడానికి ముందే ఈ వ్యవహారాన్ని బయటకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించారని ఆమె ఆరోపించారు. ఆ సమయంలో తాను, రాజీవ్ ఇంట్లో లేకపోయినా, జరిగిన పరిణామాలకు తమపై కూడా నిందలు వచ్చాయని పేర్కొన్నారు. ఆ తర్వాత కుటుంబ సంబంధాలు మరింత దెబ్బతిన్నాయని, తనకు, రాజీవ్‌కు వ్యతిరేకంగా జర్నలిస్టుల ద్వారా కథనాలు ప్రచారం చేయించారని సోనియా ఆరోపించారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత తామిద్దరం దేశం విడిచి వెళ్లిపోవాలని ప్రయత్నించామంటూ వచ్చిన వార్త పూర్తిగా అబద్ధమని స్పష్టం చేశారు. సంజయ్ మరణం తర్వాత ఆయన కుమారుడు వరుణ్‌ను కలుసుకునే విషయంలోనూ మేనకా, గాంధీ కుటుంబం మధ్య వివాదాలు తలెత్తాయని, చివరకు న్యాయపరమైన పోరాటానికి దారితీశాయని వివరించారు. ఇలా ప్రేమతో ప్రారంభమైన కుటుంబ అనుబంధం రాజకీయ ఆశయాలు, అపార్థాలు, పరస్పర ఆరోపణలతో ఎలా విచ్ఛిన్నమైందో సోనియా తన కోణంలో వివరించారు. ఈ ఆరోపణలపై మేనకా గాంధీ స్పందన కూడా చర్చలో కీలకంగా మారనుంది.

సెహ్వాగ్ వారసుడి విధ్వంసం

160 పరుగులతో ఆర్యవీర్ సునామీ.. యూఏఈపై భారత్ ఘన విజయం!



309 పరుగుల భారీ స్కోరు సాధించింది. దిగ్గజ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ కుమారుడు ఆర్యవీర్ 168 బంతుల్లో 160 పరుగులతో ప్రత్యర్థి బౌలింగ్‌ను చీల్చిచెండాడాడు. అతడికి తోడుగా వికే వినీత్ 67 పరుగులతో అద్భుత సహకారం అందించాడు. వీరిద్దరూ కలిసి 193 పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని నమోదు చేసి భారత స్కోరుకు గట్టి పునాది వేశారు. అనంతరం 310 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన యూఏఈ 239 పరుగులకే ఆలౌటైంది. భారత బౌలర్లు సమష్టిగా రాణించగా, ఇషాన్ సూద్ చివరి నాలుగు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి పోరాటానికి తెరదించాడు. మోహిత్ ఉల్వా, కావ్య పటేల్, యశ్వర్ధన్ చౌహాన్, మనల్ చౌహా, అర్జున్ రాజ్‌పుత్, ఆర్యన్ సావ్సానీ తలో వికెట్ సాధించారు. బ్యాటింగ్‌లో ఆర్యవీర్ విధ్వంసం, బౌలింగ్‌లో భారత కుర్రాళ్ల సమష్టి ప్రదర్శనతో టీమిండియా సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది.



ఓపెనింగ్‌లో బౌండరీల మోత.. బ్యాటింగ్‌లో పరుగుల వరద.. ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపిస్తూ భారత యువ సంచలనం ఆర్యవీర్ సెహ్వాగ్ అద్భుత ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. ఒమన్ వేదికగా ఆదివారం యూఏఈతో జరిగిన అండర్ 19 ఆసియా కప్ 2026 కీలక గ్రూప్ మ్యాచ్‌లో టీమిండియా 70 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి సెమీఫైనల్ బెర్తును ఖాయం చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి

కివీస్ టెస్టులకు పంత్ ఎంట్రీ

భారత టెస్టు జట్టుకు భారీ ఊరట



స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ న్యూజిలాండ్ పర్యటనకు సిద్ధమవుతున్నాడు. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నుంచి ఫిట్‌నెస్ క్లియరెన్స్ లభిస్తే నవంబర్ 12న వెల్లింగ్టన్‌కు బయలుదేరనున్నట్లు సమాచారం. ఇరానీ కప్‌లో రెస్ట్ ఆఫ్ ఇండియా తరఫున ఆడుతున్న సమయంలో పక్కటెముకల పక్కన కండరాల గాయానికి గురైన పంత్ కోలుకునేందుకు కొంతకాలం ఆటకు దూరమయ్యాడు. తొలుత భారత్ఎ జట్టులో చోటు దక్కినా, అవసరమైన రిటర్న్ టు ప్లే సర్టిఫికెట్ రాకపోవడంతో ఆడలేకపోయాడు. ప్రస్తుతం పూర్తిగా కోలుకున్న పంత్ మ్యాచ్ సిమ్యులేషన్ ప్రాక్టీస్‌లో పాల్గొంటున్నాడని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. మంగళవారం, బుధవారం జరిగే పరీక్షల్లో సత్తా చాటితే ప్రయాణానికి మార్గం సుగమం కానుంది. న్యూజిలాండ్ పరిస్థితులపై మంచి అవగాహన ఉన్న పంత్ రాక భారత బ్యాటింగ్‌తో పాటు వికెట్ కీపింగ్ విభాగానికి కూడా బలాన్నివ్వనుంది. ఇప్పటివరకు 52 టెస్టులు ఆడిన ఈ ఎడమచేతి వాటం బ్యాటర్ 8 సెంచరీలు, 21 అర్ధసెంచరీలతో 43కు పైగా సగటు నమోదు చేశాడు. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా గడ్డలపై శతకాలతో మెరిసిన పంత్.. కివీస్ గడ్డపైనా తనదైన దూకుడు చూపించేందుకు సిద్ధమవుతున్నాడు.



వరుణుడి దెబ్బ

భారత్ ఆధిపత్యం పదిలం! మూడో వన్డే రద్దుతో కివీస్‌కు నిరాశ..

11 సిరీస్‌ల విజయ పరంపరకు బ్రేక్! న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌లో టీమిండియా ఆధిపత్యం కొనసాగింది. హామిల్టన్ వేదికగా మంగళవారం జరగాల్సిన మూడో వన్డేకు వర్షం తీవ్ర అంతరాయం కలిగించడంతో ఒక్క బంతి కూడా పడకుండానే మ్యాచ్ రద్దయింది. టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. వర్షం కాస్త తెరిపినివ్వడంతో మ్యాచ్ నిర్వహణకు మైదాన సిబ్బంది ఏర్పాట్లు చేసినా.. మళ్లీ వరుణుడు ఆటకు అడ్డుపడ్డాడు. దీంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే తొలి రెండు వన్డేల్లో విజయాలు సాధించిన భారత్ 20తో సిరీస్‌లో ఆధిక్యంలోకొనసాగుతోంది.మరోవైపు స్వదేశంలో వరుసగా 11 ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లు గెలిచిన న్యూజిలాండ్ విజయ పరంపరకు ఈ మ్యాచ్ రద్దుతో తెరపడింది. మిగిలిన రెండు వన్డేల్లో గెలిచి సిరీస్‌ను సమం చేయాలని కివీస్ పట్టుదలగా ఉంది. శుక్రవారం, ఆదివారం మౌంట్ మాంగనూయ్‌లో తదుపరి మ్యాచ్‌లు జరగనున్నాయి. మెరుగైన వాతావరణం ఉండే అవకాశాలున్నాయి. ఈ మ్యాచ్‌తో గిల్ వన్డే బాధ్యతలకు తాత్కాలికంగా విరామం ఇవ్వనున్నాడు. టెస్టు సిరీస్ సన్నాహాల్లో నిమగ్నం కానుండగా, మిగిలిన వన్డేలకు శ్రేయస్ అయ్యర్ భారత జట్టుకు నాయకత్వం వహించనున్నాడు.




జనవరిలో ఐపీఎల్

జూహీ చావ్లా ప్రతిపాదన! ఎండల్లో క్రికెట్‌కు స్వస్తి చెప్పాలా?

ఐపీఎల్ షెడ్యూల్‌ను మార్చాలని కేకేఆర్ సహ యజమాని జూహీ చావ్లా సరికొత్త ప్రతిపాదన తెరపైకి తెచ్చారు. ఏప్రిల్‌మే నెలల్లో తీవ్రమైన ఎండల మధ్య ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ లీగ్ నిర్వహించడం కంటే జనవరిలో ప్రారంభిస్తే ఆటగాళ్లకు మెరుగైన పరిస్థితులు ఉంటాయని అభిప్రాయపడ్డారు. ఐపీఎల్ ఇప్పుడు క్రికెట్ క్యాలెండర్‌లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకుందని, ఇక క్యాలెండర్‌ను ప్రభావితం చేసే స్థాయికి ఎదిగిందని ఎక్స్ వేదికగా వ్యాఖ్యానించారు. జూహీ ప్రతిపాదనకు ఐపీఎల్ మాజీ ఛైర్మన్ లలిత్ మోదీ మద్దతు ప్రకటించారు. ఐసీసీ అనుమతి కోసం ఐపీఎల్ ఎదురుచూడాల్సిన అవసరం లేదని, బీసీసీఐ దేశీయ టోర్నీ నిర్వహణ తేదీలను నిర్ణయించుకునే అధికారం కలిగి ఉందని పేర్కొన్నారు. అంతర్జాతీయ మ్యాచ్‌లు, ఆటగాళ్ల అందుబాటును సమన్వయం చేసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఏప్రిల్‌మే ఎండల నుంచి బయటపడేందుకు జనవరిలో ఐపీఎల్ ప్రారంభించడం లేదా అక్టోబర్ నుంచి ఏప్రిల్ వరకు ప్రత్యేక క్యాలెండర్ రూపొందించడం వంటి రెండు ప్రత్యామ్నాయాలను సూచించారు. మెరుగైన వాతావరణం, నాణ్యమైన క్రికెట్, ప్రసార ఆదాయం పెంపు, ఆర్థికంగా మరింత బలోపేతం కావడం ఈ మార్పుల లక్ష్యాలని వివరించారు. ఫుట్‌బాల్‌లో ఇంగ్లిష్ ప్రీమియర్ లీగ్ తరహాలో ఐపీఎల్ కూడా ప్రపంచ క్రీడా వ్యాపారాన్ని ప్రభావితం చేసే స్థాయికి చేరిందని మోదీ అభిప్రాయపడ్డారు.

ఆస్కార్ అంచనా వెనక్కి

•'రామాయణం'పై కృష్ణుడి ఆగ్రహం! • నితీశ్ భరద్వాజ్ సంచలన వ్యాఖ్యలు



భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత భారీ చిత్రంగా తెరకెక్కిన రణ్‌బీర్ కపూర్, యశ్, సాయి పల్లవి నటించిన 'రామాయణం' ఇప్పుడు అనూహ్య వివాదంలో చిక్కుకుంది! బీఆర్ చోప్రా తెరకెక్కించిన 'మహాభారతం'లో శ్రీకృష్ణుడిగా కోట్లాది మంది అభిమానుల మనసులు గెలుచుకున్న నటుడు నితీశ్ భరద్వాజ్ ఈ సినిమా విషయంలో తన వైఖరిని పూర్తిగా మార్చుకున్నారు. తొలుత ట్రైలర్ చూసి అద్భుతమని ప్రశంసించడమే కాకుండా, ఉత్తమ విదేశీ చిత్రంగా ఆస్కార్ అందుకునే అవకాశముందని అంచనా వేశారు. దర్శకుడు నితీశ్ తివారీని ప్రపంచ సినిమాకు భారత్ అందిస్తున్న మరో గొప్ప బహుమతిగా అభివర్ణించారు. అయితే సినిమా తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ తన పాత ప్రశంసలను వెనక్కి తీసుకున్నారు. రామాయణం కేవలం కథ కాదు.. భారతీయుల ఆధ్యాత్మిక, సాంస్కృతిక జీవనంలో భాగం అని పేర్కొన్నారు. రావణుడిని అత్యంత



ఉదారవాది, సామాజిక న్యాయాన్ని పాటించే వ్యక్తిగా చూపించడం ద్వారా రామాయణంలోని ధర్మం, మర్యాద, అవతార పరమార్థం దెబ్బతింటున్నాయని తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఈ సినిమా పట్ల తీవ్ర నిరాశకు గురయ్యానని, చెప్పడానికి ఒక్క మంచి మాట కూడా లేదని ఘాటుగా వ్యాఖ్యానించారు. అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్ మాత్రమే మహాకావ్యంలోని తాత్వికతను, ఆధ్యాత్మికతను భర్తీ చేయలేవని స్పష్టం చేశారు. భారతీయ చరిత్ర, వారసత్వం, సంస్కృతిని అంతర్జాతీయ వేదికపై తప్పుగా ప్రతిబింబించే చిత్రానికి ఆ గౌరవం దక్కకూడదన్నది తన అభిప్రాయమన్నారు.

26 ఏళ్ల తర్వాత రేణు దేశాయ్ రీఎంట్రీ



* ధనుష్ సినిమాలో కీలక పాత్ర!
* సాయి పల్లవి, శ్రీలీల, మమ్ముట్టితో కలిసి సందడి!

నటి రేణు దేశాయ్ మరోసారి వెండితెరపై సందడి చేసేందుకు సిద్ధమయ్యారు. అది కూడా సాధారణ రీఎంట్రీ కాదు.. ఏకంగా కోలీవుడ్ స్టార్ ధనుష్ సినిమాలో ప్రత్యేక ఆకర్షణగా నిలవబోతున్నారు! ధనుష్ హీరోగా, రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'ఓం చాప్టర్ 1'లో రేణు దేశాయ్ నటిస్తున్నట్లు అధికారికంగా వెల్లడించారు. నవంబర్ 20, 2026న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్ వేదికగా రేణు దేశాయ్ ఈ విషయాన్ని ప్రకటిస్తూ.. నవంబర్ 20న థియేటర్లలో కలుద్దాం అంటూ అభిమానుల్లో ఆసక్తి పెంచారు. గతంలో మమ్ముట్టితో కలిసి దిగిన ఫొటోలను పంచుకోవడంతో ఈ సినిమాలో ఆమె పాత్రపై ఊహాగానాలు మొదలయ్యాయి. ఇప్పుడు వాటికి తెరదించుతూ తన సినిమా ఎంట్రీని ధృవీకరించారు. 2000లో విడుదలైన 'జేమ్స్ పాండు' తర్వాత దాదాపు 26 ఏళ్లకు మళ్లీ తమిళ చిత్రంలో నటిస్తుండటం విశేషం. గతంలో 'కాశీ మజిలీ'తో ప్రేక్షకులను పలకరించిన ఆమెకు ఇది మరో ముఖ్యమైన సినీ ప్రయాణం కానుంది. అయితే సినిమాలో ఆమె పాత్ర ఏమిటి? ఎంతసేపు తెరపై కనిపించనున్నారు? అనే వివరాలు ఇంకా వెల్లడించలేదు. మరోవైపు సాయి పల్లవి, శ్రీలీల, మమ్ముట్టి, ఇంద్రన్స్, నసీరుద్దీన్ షా వంటి ప్రముఖ నటులు ఈ చిత్రంలో భాగమయ్యారు. వండర్‌బార్ ఫిల్మ్స్, ఆర్‌టేక్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తుండగా, సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నారు. ఇంతటి భారీ తారాగణంతో వస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే అంచనాలు పెరిగాయి. ఇప్పుడు రేణు దేశాయ్ రీఎంట్రీతో అభిమానుల్లో మరింత ఆసక్తి నెలకొంది!

టైటిల్ ప్రచారానికి బ్రేక్

- నిర్మాతల్లో పెరుగుతున్న ఆగ్రహం!
- సెన్సార్ నిబంధనలతో టాలీవుడ్‌లో కలకలం
- రచ్చ రేపుతున్న సెన్సార్ బోర్డు కొత్త నిబంధనలు

సినిమా సెన్సార్ పూర్తి చేసి సర్టిఫికెట్ పొందే వరకు ఎలాంటి ప్రచారం నిర్వహించకూడదంటూ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (CBFC) తీసుకొచ్చిన కొత్త మార్గదర్శకాలు టాలీవుడ్‌లో తీవ్ర చర్చకు దారితీశాయి. సినిమా విడుదలకు ముందే ప్రేక్షకుల్లో ఆసక్తి పెంచేందుకు ప్రచారం కీలకమని, అలాంటి సమయంలో పబ్లిసిటీపై ఆంక్షలు విధించడం నిర్మాతలకు పెద్ద దెబ్బగా మారుతుందని చిత్ర పరిశ్రమ వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. చిన్న సినిమాలు, పెద్ద సినిమాల విషయంలో సెన్సార్ అధికారులు వేర్వేరు విధానాలు అనుసరిస్తున్నారనే విమర్శలూ వినిపిస్తున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో మైత్రీ మూవీ మేకర్స్ తాజా చిత్రం 'దొంగ నా కొడుకు' టైటిల్‌ను 'డీఎన్‌కే (DNK)'గా మార్చినట్లు తెలుస్తోంది.

సర్టిఫికెట్ వచ్చాకే టైటిల్ ప్రచారం

ఫిల్మ్ ఛాంబర్‌లో టైటిల్ నమోదు చేయించుకున్నంత మాత్రాన దానికి తుది ఆమోదం లభించినట్లు కాదని CBFC స్పష్టం చేసింది. సినిమా పేరు, ట్రైలర్, టీజర్, ప్రోమోలతో సహా ప్రచారానికి సంబంధించిన అంశాలను సెన్సార్ సర్టిఫికెట్ వచ్చిన తర్వాతే ఉపయోగించాలని కొత్తనిబంధనలు చెబుతున్నాయి. టైటిల్‌ను ఇప్పటికే ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లిన తర్వాత చివరి నిమిషంలో మార్చాల్సి వస్తే సినిమా ప్రచారంతో పాటు కలెక్షన్లపైనా ప్రతికూల ప్రభావం పడుతుందని ప్రొడ్యూసర్ కౌన్సిల్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. ముఖ్యంగా భారీగా ప్రచార ఖర్చు పెట్టిన నిర్మాతలకు ఈ నిబంధన ఆర్థిక భారంగా మారుతుందని అభిప్రాయపడుతోంది.

ఫైనల్ వెర్షన్‌తోనే సెన్సార్‌కు దరఖాస్తు

సినిమాటోగ్రాఫ్ చట్టం, 1952, సినిమాటోగ్రాఫ్ (సర్టిఫికేషన్) నిబంధనలు, 2024 ప్రకారం CBFC కొత్త మార్గదర్శకాలను అమలు చేయనుంది. సర్టిఫికేషన్ కోసం సమర్పించే సినిమా పూర్తిగా తుది రూపంలో ఉండాలి. టైటిల్స్, క్రెడిట్స్, సబ్‌టైటిల్స్, డిస్‌క్లెయిమర్లు, సెన్సార్ సర్టిఫికెట్ స్లేట్, నేపథ్య సంగీతం, సౌండ్ మిక్సింగ్‌తో పాటు క్లోజ్డ్ క్యాప్షన్లు, వినికిడి లోపం ఉన్నవారి కోసం సబ్‌టైటిల్స్, ఆడియో డిస్క్రిప్షన్ వంటి సౌకర్యాలు కూడా పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలి. తాత్కాలిక గ్రాఫిక్స్, స్క్రాచ్ స్కోర్‌లు, అసంపూర్తి యాక్సెసిబిలిటీ అంశాలతో దరఖాస్తు చేస్తే నిబంధనలకు విరుద్ధమని బోర్డు పేర్కొంది. ధృవీకరించిన వెర్షన్‌ను మాత్రమే థియేటర్లలో ప్రదర్శించాలని స్పష్టం చేసింది.

నిర్మాతల విడుదల షెడ్యూల్‌కు బ్రేక్

సినిమాటోగ్రాఫ్ చట్టంలోని సెక్షన్ 5బి(1), సర్టిఫికేషన్ రూల్స్ 2024లోని రూల్ 25 ప్రకారం సినిమా టైటిల్‌ను పరిశీలించడం, సమీక్షించడం, అవసరమైన మార్పులు సూచించడం వంటి అధికారాలు ఎగ్జామినింగ్, రివైజింగ్ కమిటీలకు



ఉంటాయి. సినిమా లేదా ట్రైలర్ విడుదల తేదీని బట్టి సెన్సార్ ప్రక్రియను వేగవంతం చేయలేమని CBFC స్పష్టం చేసింది. నిర్మాతలు ప్రకటించిన విడుదల తేదీల ఆధారంగా బోర్డుపై ఒత్తిడి తీసుకురావద్దని సూచించింది. ఇప్పటికే విడుదలకు ముందు అనేక మార్పులు చేసే పరిశ్రమలో ఈ నిబంధనలు మరిన్ని ఇబ్బందులు సృష్టిస్తాయని నిర్మాతలు వాపోతున్నారు. సినిమా సంఘాలతో సంప్రదింపులు జరపకుండా తీసుకున్న నిర్ణయాలను పునఃసమీక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. కేరళ ఫిల్మ్ ఛాంబర్ ఇప్పటికే CBFCకి లేఖ రాసి, కొత్త నిబంధనలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని కోరింది. సెన్సార్ నిబంధనలపై దేశవ్యాప్తంగా చిత్ర పరిశ్రమలో వ్యతిరేకత పెరుగుతోంది.

రేణు దేశాయ్ సంచలన సందేశం!

విమర్శలు వద్దు.. మానవత్వమే మిన్న!

పవన్ వ్యక్తిగత జీవితంపై చర్చల పోస్ట్ వైరల్..

పవన్ కల్యాణ్ వ్యక్తిగత జీవితంలో మరో కీలక పరిణామం చోటుచేసుకున్న వేళ.. ఆయన మాజీ భార్య, నటి రేణు దేశాయ్ సోషల్ మీడియాలో చేసిన ఓ పోస్ట్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది! మూడో భార్య అన్నా లెజ్‌నెవాతో 13 ఏళ్ల వైవాహిక బంధానికి ముగింపు పలుకుతున్నట్లు పవన్ కళ్యాణ్ ప్రకటించిన కొద్ది గంటల్లోనే రేణు మానవత్వం, కరుణ, సానుభూతి గురించి ఓ భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. కష్టాల్లో ఉన్న వ్యక్తిని మరింత కిందకు లాగడం అమానవీయం. ఎవరైనా సరే.. వారి పరిస్థితి ఎలా ఉన్నా మనుషులుగా గౌరవించాలి. వారు కూడా ఎవరికో బిడ్డలు, తల్లిదండ్రులు, తోబుట్టువులే అంటూ తన పోస్టులో పేర్కొన్నారు. ఇతరుల జీవితాల్లోని లోపాలను విమర్శించే ముందు మన జీవితాల్లోనూ ఎన్నో అసంపూర్ణతలు ఉన్నాయని గుర్తించాలని సూచించారు. దయ, జాలి, సానుభూతి మనిషికి ఉండాల్సిన ప్రాథమిక లక్షణాలని స్పష్టం చేశారు. అంతేకాదు, తన వ్యాఖ్యలను పవన్ విడాకులతో ముడిపెట్టి అనవసర ఊహాగానాలు చేయవద్దని కూడా రేణు కోరారు. సమాజం మరింత మంచిగా మారాలన్న ఉద్దేశంతోనే ఈ మాటలు చెబుతున్నానని, ఎవరి నుంచీ డబ్బులు తీసుకుని ఈ సందేశం ఇవ్వడం లేదని చమత్కారంగా వ్యాఖ్యానించారు.

This newspaper is Owned and Published by **GUNDEBOINA VENKANNA** from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: **GUNDEBOINA VENKANNA** and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: **TGBIL/26/A6717**. www.rajyasamskarana.com.